

కథ 1996

11

# తాయమ్మ కథ

కరుణ

ఒడ్లు పడ్తున్నగని మన్సుల మన్సు లేదు. పొద్దున్నుంచి ఒంట్ల సత్తువంత ఎవరో చెయ్యిబెట్టి దేవినట్టుగుంది. అందులోటి పొద్దున్నుంచి అన్నం తిన్లే. ఒంటి గంట య్యింది. మిల్లు కాడికి ఒగరి తర్వాత ఒగరు ఒస్తనే వున్నరు.

అప్పుడే ఒడ్లు పట్టుడై పోయింది. పాణమంత జరమొచ్చినట్టుగుంది. కాల్లు గుంజుతా వున్నయి. కాసేపు కూలబడ్దామని ముడ్డి మోపుతున్నంగనే కుమ్మరి మారమ్మొచ్చి,

"ఓ తాయమ్మొదిన జరొచ్చి గీ గంప దించు," అన్నది.

లేసి గంప దించిన.

"అట్లున్నవేంది తాయమ్మొదిన, జరంగిన ఒచ్చిందా?"

మారెమ్మతోటి మంచి దోస్తి. ఇద్దరం కష్టపడే టోళ్లమే. మారెమ్మ మొగడు సుత మంచోడుగాడు. మారెమ్మ ఎప్పుడైన పగటిపూటే ఒడ్లు తెస్తది. పగలు ఊర్ల జనం కూలికి పోయేటోళ్లు కూలికి పోతరు. ఎవరి పన్లల్లకు ఆళ్లుపోతరు. ఒడ్లు పట్టిన తర్వాత కాసేపు ఒగరి బాధలు ఒగరం జెప్పుకొని ఊర్ల సంగతులు గిన మాట్లాడుకుంటం.

"మంచి మంచోళ్లకు సావొస్తది నాకు రాదేంది పిల్ల."

"అయ్యో! అంతలావు మాటనుకుంటవొదినా. ఏఁవైందిప్పుడు."

"ఏంగావాలె పిల్ల మీ అన్న మిల్లమ్మేటట్టుండు."

"మిల్లమ్మితే ఏంజేస్క బత్కుతరొదినా? అన్న జెయడు నిన్ను జెయనియడా? బాగుందన్న యవారం" అని,

"కొడుకులేమంటుండ్రు."

"కొడుకుల నోట్ల మన్నుబడ. ఏం కొడుకులు మారెమ్మ."

"కన్న కష్టాలు పడి సదివించినవు. ఆళ్లు పట్టించు కోకపోతే ఎట్లొదినా."

"ఆళ్లు పెద్ద పెద్ద ఉజ్జోగాలు చేసుకుంటోళ్లు. ఆళ్లకు మన కష్టాలు కానరావు మారెమ్మ."

"నువ్వు పడ్డ కష్టాన్ని ఇంతెల్ల మర్సిపొయిం డ్రంటవా ఒదినా?" నమ్మలేక మారెమ్మ.

"కష్టపడ్డోనికి కష్టం సంగతి తెలుస్తది. కష్టపడ నోనికి కష్టం ఎట్ల తెలుస్తది మారెమ్మ."

"అవున్లే ఒదినా, ఎంతైనా సదువుకున్నోడి కంటె సాకలోడు నయం."

"నిజవేగద. నా కొడుకులు మంచి సదువులు సదువుకుంటున్నరని కష్టంజేసి పంపుకుంట మురిస్తి గని, ఆళ్లు సదువుకొని జూసుకుంటరా? సూసుకోరా? అని సూసుకోకపోతి."

"అన్న సంగతి ఇన్నేండ్లసంది సూస్తున్నగద. మిల్ల మ్మిండంటె నిన్ను నట్టేట్ల ముంచినట్టే ఒదినో.. జర జాగ్రత్తగుండు."

"ఇట్ల మాట్లాడుకుంటుంటె పొద్దుగూకింది. మొదలు నాయి పట్టొదినా," అని ఒడ్లు పట్టించుకొని ఎళ్లిపోయింది. తర్వాత ఇంకొకామెయి పట్టిన. ఎవరు రాలె మిల్లుకాడికి. ఆన్నే కూసున్న.

పెద్ద మన్సులల్లకు పొద్దుననంగ పొయిన మను సులు ఇంకా రాలే. పంచాతేమైతుందో ఏవోఁ. పంచాతి

నాకు, అన్సూరికి అయితే ఈళ్లు బోవుడేందో. అన్సూరి పంచాతి పెట్టుకొనుడేందీ, మా బావ ఇంటికి పిలిపిచ్చి ఒడ్లు రాకుంట తలుపులు మూసుకొమ్మనుడేందీ, మా ఆడిబిడ్డ ఇంటికొచ్చి అన్సూరి నిన్ను ఇంట్లనుండి గుంజి కొడ్తదంట అని బెదిరించుడేందీ, అల్లుడొచ్చి మిల్లు, ఇల్లు అమ్ముదామనుడేందీ. ఈళ్లందరు ఏదో మాట్లాడు కుని సేస్తున్నట్టన్పిస్తుంది. సూడబోతె నిజంగనే మిల్లు గాని అమ్ముకరారు గద. ఇన్నేండ్ల సంది లేంది అన్సూరి ఇప్పుడు పంచాతి పెట్టుడేంది. కొడుకుల సూద్దునా అట్లున్నరు. మిల్లు నా చేతుల్నుంచి పోతే నన్ను గొర గానిస్తరా? పని జేస్క బతుకుతుంటెనే ఆగమాగం జేస్తున్నరు.

ఏం బతుకు నాది. పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి ఎన్నడన్న నిమ్మలంగుంది లేదాయె. ఆనాడు మేన మామింట్ల. పెండ్లయిన కాన్నుంచి ఈడ. ఎన్నడు కష్టాలే నాయే. ఈ పెండ్లి ముదునష్టంగాను పెండ్లైన కాన్నుంచే మరీ పాణానికి సుఖం లేకుంటపోయింది అనుకుం టుంటె ఎన్కటివి గుర్తుకొచ్చినయి. పెండ్లెట్లయింది, పెండ్లైన కాన్నుంచి ఎట్ల బతికింది కండ్లల్ల మెదిలినట్ల య్యింది.

*

పదకొండేండ్లుంటయ్. మోకాల్లకాడికి లంగ తొడుక్కొని, జాకెట్ ఏసుకుని, చింపిరి జుట్టు పెట్టు కొని, ఎర్రగ, బక్కగ, కట్టెపుల్లోదిగ వుండేది. పొద్దున్నే సాంపి జల్లేటందుకు పొద్దుగూకాల ఊరి యెన్కకు పొయ్యేది. బర్లన్ని ఊర్ల కొస్తుంటయప్పుడు. అప్పుడయి పేడ బెడ్తుంటె ఉర్కి ఉర్కి ఆటెన్కబడి తట్టనిండ పేడ నింపుకొని ఇంటికి మల్లేది. అయ్యాలట్లనే తట్టనిండ పేడ ఏస్కొని ఇంటికొచ్చిన. ఇంటికొచ్చి సాంపిగోళంల పేడేసి, గోళం మీద తట్ట బోర్లించి ఒచ్చేసర్కి గలప ముందల చానా చెప్పులున్నయ్. ముగ్గురు కొత్తోళ్లు మంచంల కూసొని వున్నరు. మావయ్య ఆళ్ల పక్కనే మంచంల కూసుండు. అమ్మ మొగురాని కానుకొని కూసుంది. అమ్మ ఎప్పుడొచ్చిందో. నేను పొయ్యి అమ్మ కాడ కూసున్న. ఒళ్ల కూసబెట్టుకొని తల నివురుకుంట,

"బాగున్నావురా తాయి" అన్నది.

నాకు ఏడుపొస్తుంది. బాగున్నని తల్కాయూపిన.

మావయ్య, "ఇటొచ్చి నిలబడు తాయమ్మ" అన్నడు.

అమ్మేమో, "మావయ్య పిలుస్తుండు పోవే," అన్నది.

నేను పొయ్యి మావయ్య పక్కన నిలబడ్డ. మంచంల కూసున్నోళ్లు సూస్తా వున్నరు. ఆళ్లట్ల సూస్తుంటె భయమైంది. తర్వాత మావయ్య,

"లోపలికి పో," అన్నడు.

పొద్దుగూకాల కోన్ని గోసి కూర ఒండింద్రు. అన్నం తిని ఒచ్చినోళ్లు పొయ్యింద్రు. అమ్మమొకమంత ఎట్లనో వుంది. మేం కూడా అన్నం తిని పండుకున్నం. అమ్మ నేను ఒక్క మంచంల్నే పండుకున్నం. పండుకున్న కొంచెంసేపటికి మావయ్య ఒచ్చిండు, ఆళ్లను ఊరి బయటిదాకా తోలి.

మంచం దగ్గరికి ఒచ్చి, "అక్కా!" అని పిలిసిండు.

అమ్మ, "ఏందిరా?"

మావయ్య, "నిద్రపట్టిందా?"

అమ్మ, "ఇంక పోలే," అని, అమ్మగూడ లేసి కూసొని మావయ్యకు కూసొమ్మని సోటిచ్చింది మంచం మీద.

మావయ్య, "ఈ సవంధం గురించి ఏమను కుంటున్నవక్కా...."

అమ్మ, "నేననుకునేదేవుందిరా. నువ్వేమను కుంటున్నవ్."

మావయ్య, "ఎట్ల జూసినా ఈ సవంధం బాగుంది. పిల్ల మనకు ఎదురుసూడాల్సిన పన్లేదు. నువ్వేవంటవ్."

అమ్మ, "నేనేఁవంట. అంత నీయిష్టం. పిల్లను నీకప్పజెప్పి నాలుగేండ్లయ్యింది."

మావయ్య, "తాయిని నా సొంతబిడ్డ లెక్క సూసుకున్న. దానికేం లోటు రానిచ్చిన."

అమ్మ, "నువ్వు లోటు రానిచ్చినవని అంటు న్ననా."

మావయ్య, "మరి సవంధం ఖాయం జెయ మంటవా?"

అమ్మ, "నీ యిష్టం."

మావయ్య, "నీ యిష్టమేంది. మన్సులేవుందో జెప్ప రాదా?"

అమ్మ, "నా మన్సులుండేదేవుందిరా. రెండో సవంధం. ఇంతకు ముందున్న పిల్లని కన్నకతలు బెట్టి ఎల్లగొట్టింద్రంట."

మావయ్య, "ఎవరో గిట్టనోళ్లు అట్ల జెప్పింద్రేమో. మొదటి పిల్లను ఎళ్లగొట్టింద్రు గద. రెండోదాన్ని మంచిగ సూసుకుంటరు. అయినా ఇంతకంటె మంచి సవంధం తేవటం నా వల్లగాదు. నాకూ పిల్లలున్నరు."

అమ్మ, "సరె అట్లనే గానియ్యి. దాని రాతెట్లుంటె అట్లయితది."

మావయ్యకు కోపమొచ్చినట్టుంది. ఎళ్లిపోయిండు. అమ్మ పండుకొని గుణుక్కుంటా వుంది.

"ఇట్లాంటోడు నా యిష్టమడుగుడేందో. పిల్లల్లేరు సాదుకుంటన్దెచ్చుకొని, పిల్లలు పుట్టంగనె ఆళ్ల పీతి గుడ్డలుతికించిన్రు. ఆళ్లను ఏడిస్తె ఆడించింది. అది యిప్పుడే పిల్లలతల్లైంది. కన్నసాకిరి చేయించుకున్నరు. సిన్నపోరని లేదాయె, చిత్కపోరని లేదాయె. ఇంటెడు పని చేయించుకుంటుండు. ఏవెర్గనట్టు 'తాయికేం లోటు రానిచ్చిన. సొంత బిడ్డలెక్క సూసుకున్న' అంటుండు. తను గన్నబిడ్డే అయితే ఇంత కష్టం జేయించుకుననా. ఇట్ల ఎవనికో ఓనికి అంటగట్టునా.

"దాని బతుకినిట్ల అన్యాయం పాల్జేద్దునా. దాని బతుకిట్ల బుగ్గిపాలు గాకుండ తీస్కపోదునా? ఏడికి తీస్కపోను. చేతిల చిల్లిగవ్వలేదు. తిండికెల్లుడే కనా కష్టంగుంది. ఈ అన్యాయాన్నిట్ల సూసుకుంట ఊకోవాల్సిందేనా? దాని తండ్రే బతికుంటె దానికీ గతి పట్టక పోవును గద. ఎన్ననుకొని ఏం లాభం. దాని బతుకేం గానుందో."

నేను అటువైపు తిర్గి పండుకుంటె తనకైయ్యి తిప్పకుంది. తలకాయ మీద చెయ్యేసి నివురాతా వుంది. గుండెలు అప్పుడప్పుడు ఎగిరిపడ్తున్నయి. రెండు మూడుసార్లు ముక్కుగూడ చీదింది. ఏడుస్తున్నట్టుంది.

పెండ్లంటె ఏందో తెల్వకుంటనే పెండ్లైయిపోయింది.

*

ఆ యిల్లు ఆల్కేటందుకే మున్నాల్గు గంటలు పడ్తది. ఆకిలి గూడ పెద్దదే. దానికో గంటసేపు పడ్తది. పది కుండలు సాంపి జల్లాలి. ఆరు బర్లున్నయి. అండ్ల ఎప్పుడు రెండు మూడు బర్లు పాలిస్తయి. బర్లకాడికి సాకిరంత నాదే. సల్ల నాకు పెర్గు ఆళ్లకు. యాభై మేకల దాంక వున్నయి. మేకలను గోస్తె పొట్టపేగులు, తల కాయకూర గిన నాకేస్తరు. మేకలను, బర్లను జీతగాడు కాసుకొస్తడు. వందదాంక కోళ్లున్నయి. కోళ్లను గమ్మడు, అయి గుడ్లు పెడ్తె గిన తీసేది నేను. తినేది ఆళ్లు. పది ఎకరాల పొలం, ఏడెకరాల చెల్క వుంది. పొలం పన్లకు పోవాలి. నాట్లెయ్యాలె, కలుపు దియ్యాలె. కోతలు గొయ్యాలె. మల్ల పొయ్యిలకు కట్టెలు కొట్కరావాలె. కారం దంచాలె పసుపు దంచాలె. బర్లకు గడ్డి గోస్క రావాలె.

పొద్దున్లేసిన కాన్నుంచి రాత్రి పండుకునే దాంకా నడువులిరిగేటంత పని. ముడ్డి మలుప ఈలుగాదు. ఈ పన్లన్ని ఒదాని తర్వాత ఓటి పెద్దమనిషినయ్యేసరికి మీద పడ్డయ్.

తిండి రెండు పూటలే. పొద్దున సద్దగట్క, లేకుంటె జొన్నగట్క. సగం గట్కకు గూడ కూర సరిపోక పొయ్యేది. మిగిల్న గట్కలంత సల్లపోస్కొని తొక్కు అంచుకు పెట్టుకుని తాగేది. రాత్రికి వరన్నం. మా ఏరాలు రెండుపూట్ల వరన్నవే తినేది. గట్క తినవని మా అత్త పెడ్తె 'ఈ కుక్క పియ్యి ఎవర్తింట'రని పల్లెం నూకి పొయ్యేది. మా అత్త మల్ల వరన్నం పెట్టి పిలిస్తె ఒచ్చి తినేది. నాగ్గూడ వరన్నం పెట్టవని అడ్గితే, 'తింటెతిను లేకుంటె ఊకో. లెస నీల్గుతున్నవ్,' అనేటోళ్లు. గట్క తిననంటె వరన్నం పెట్టేటోళ్లు ఎవర్లేరు. మా ఏరాలు మా అత్తకు అన్నబిడ్డ. నేను దూరపు దాన్నయితి. ఇంట్ల అందరు సబ్బుతోటి తానం జేస్తే నేను తౌడుతోటి జేసేది. ఏఁవన్నంటె "నీ మొగణ్ణి తెమ్మనరాదు. నీ మొగడు తెస్తుంటె ఒద్దన్నవా?" అనేటోళ్లు. నా మొగడేవో నా మాటినడాయె.

మూడు రోజులకోపాలి తానం జెయాలె. ఓనాడు తానం జేసొచ్చి చీరకట్టుకుంటుంటె సూస్తావుండు. ఏందో నిమ్మలంగ సూస్తుండని సిగ్గయింది. చీర కుచ్చిలు పోసి బొడ్లకు దోపుకొని అట్లనే ఒంటింట్లకు పొయ్యి పీటేసిన. ఒచ్చి కూసుండు. పల్లెం ముందల పెట్టి అన్నం బెట్టిన. కూరేద్దామని తిరగంగనే పులోదిగ మీద పడ్డడు. యాడ పడ్తె ఆడ గుద్దుతుండు. ఇంతెల్ల అంత కోపమొచ్చే పనేం జేసిన్నో అర్థంగాలె. ఏడుసుకుంట "ఏంటి అట్ల గొడ్తవు. నేనేం జేసినిపుడు".

"ఏవెర్గనట్టు మాట్లాడుతుంది జూడు ఎర్రిపిల్ల. లంజె శెకలు. ఏ మిండడు సూడాలనే చీర కుచ్చిల్లు పోసి కిందికేలాడేసినవు. గోసి పొయ్యి లంజె. గోసి పొయ్. ఇంకో పాలిట్ల నా కండ్లకు కన్పించినవో బత్కవు బిడ్డ మల్ల," అని అట్లనే నిలబడ్డడు. ఏడుసుకుంట గోసి పోసిన. అప్పుడు తిన్నడు అన్నం కడుపార.

ఇట్లనే ఓపాలి శుక్రారం తలకు పోసుకున్న. అన్నంగిన తిని నెత్తికి నూనె రాస్కుందావని కూసున్న. మా అత్త ఎవరింటికో పొయ్యింది. మా ఏరాలు అర్రల పండుకుంది. నెత్తికి నూనె రాసుకున్న. జడేస్కొని నాలు గైదేండ్లైతుంది. జడేస్కోవాలనిపించి, నెత్తి నున్నగ దువ్వి జడేస్కొని అద్దంల జూసుకుంటున్న. నెత్తూసి పోయి జడ సన్నగ బడ్డదిగనిఎంతైనా జడ అందం జడదే అను

కుంట అద్దాన్ని ఆపక్క ఈపక్క తిప్పి సూసుకుంటున్న. యాడంగొచ్చిండో సూల్లే. జడెంటికలు పట్టి అట్లనే లేపి కుదేసిండు.

"లంజెది సాన్దానిలెక్క తయారైంది సూడు," అని గుద్దుతనే వుండు.

"జడేసుకొనుడు గూడ సాన్దాని లెక్క తయారవుడా?"

"సంసారం జేస్కునే ఆడ్దెవతి ఇట్ల సోకులబడదు. జడిప్పక ఇంక మాట్లాడుతుంది," జడిప్పి ముడేసుకున్న దాకా కొట్టి అన్నం తినకుంటనే బయటపడ్డడు. ఈలొల్లికి మా ఏరాల్కి మెల్కొచ్చి సూసి పోయిందిగని అడ్డురాలె.

రాత్రి మా బావ, ఈన కల్లుకుండ ముందల బెట్టుకొని తాక్కుంట మాట్లాడుకుంటున్నరు. మా అత్త మా ఏరాల్ని, నన్ను పిల్సి అన్నం పెట్టింది. అన్నం తిని పొయ్యి పండుకున్న.

బావ కల్లొంచుతుండు.

"రోజురోజుకు దీని సోకులు ఎక్కువైతున్నయన్న."

బావ, "ఏవైందిరా?" ఏం తెల్వనట్టు.

"దీని సంగతి జూస్తుంటే చానారోజులుండేటట్టు లేదు."

బావ, "మరి ఏంజేద్దామంటవురా?"

అత్త కోడిగుడ్డు అట్టేసుకొచ్చి పెట్టుకుంట, "పన్లేకనే ఈ ఏశాలన్ని."

బావ, "ఏం పని పెడ్దాఁవంటవే," అమ్మతో.

అత్త, "ఏదో ఓ పని ముడ్డి మెసలకుంట."

"అవునన్న సూరారంల ఒడ్లు పట్టే మిల్లు పెట్టింద్రు ఈ మధ్యనే. యవ గిరాకి. ఊరంతటికి ఒకటే మిల్లుంది. మిల్లాయన, 'ఏం మిల్లో ఏవో ఈశ్వరయ్య ముడ్డి మలుపకుంట' అని అంటుండె. అది పెడ్తావన్న."

బావ, "మిల్లుపడ్తె ఒచ్చిన పైసలు సక్కగిస్త దంటవా."

అత్త, "యియ్యక ఏడ్కిబోద్ది."

ఈన, "అది మిల్లు పడ్తె నువ్వాడ కూసొని పైస ల్దీసుకో అమ్మ."

ఇంతకుముందు బయిటి పురుగుతోటి మాట్లాడే ఈలుండేది కాదు. ఇప్పుడు మిల్లుకాడికి ఒచ్చేటోళ్లతోటి ముచ్చట్లు. ఏం ఒదినా అన్నం తిన్నవా? పనయిందా? లేకుంటె చిన్నమ్మా, బిడ్డ పెండ్లి చేస్తున్నవా? అత్తా నీ కోడలు నీళ్లు పోస్కుందటగా. ఎన్నో నెల? గియే ముచ్చట్లు. ఒగరి బాధలు ఒగరు చెప్పుకునేటందుకేఁ వుంది. అందరు బాధలు పడేటోల్లే మగల కింద. ఒడ్ల ఇంజనన్న రిపేరుకు పోయేది గని. నేనెన్నడు పోలే రిపేర్కు.

*

ఎప్పుడన్న పొద్దుగాల ఇంటికి రాలె. ఎప్పుడైన రాత్రి పదకొండు పన్నెండైతది. ఊర్ల అరుసుకునేటందుకు నా మొగుడికి చానా మందున్నరు. ఒచ్చి తలుపు కొట్టిండంట. నాకు మెల్కరాలె. అందులోంచి దూరం వున్న. పొద్దుందాంక పనిచేసి, చేసి ఒళ్లంతా పుండులెక్క వుండి పాణం జరవొచ్చినట్టుగుంది. పండు కొంగనే నిద్రపట్టింది. దమదమ గుద్దుతావుండు తలుపుని. మెల్కొచ్చి లేసి తలుపు తీసిన. నన్ను తోసుకుంటు ఒంటిట్లకు పొయ్యి దీపం ముట్టించి, ఇల్లంతా దీపం బెట్టి గూడు గూడు అర్ర అర్ర ఎతుకుతుండు. నా పాణమంత కోపంతోని ఒనుకుతుంది. అట్లనే కిరసనాయిలు మీద పోసి ఆ దీపం ఆని మీదనే ఎయ్యాలని పించింది.

"ఏంది ఏవోఁ దేవులాడుతున్నవ్."

పండ్లు పటపట కొరుక్కుంట నాకేసి జూసిండు. నేను పొయ్యి మంచంల పండుకున్న. దొడ్లెకు గూడ దీపం పట్టుకొని పొయ్యి సూసొచ్చిండు. గడ్డాఁవుల కర్ర బెట్టి పొడిసిండు. లంజొనికి లంజబుద్ధి దొంగోనికి దొంగబుద్ధి. దేవులాడుకుంటె దేవులాడుకోనియ్ నాకే వన్నాఁ బయమా. నేను మంచంల ఇటు తిరిగి పండుకున్న. ఇల్లంత సూసుకొని ఒచ్చి కర్రతోటి ఒక్కటేసిండు.

"సస్తిన్రో నాయినో," నడుపు ఇరిగినట్టని పించింది.

లంజదాన మిండన్ని పంపించి ఏఁవెర్గనట్టు పండుకున్నావె. అందుకే తలుపు తియ్యటానికి ఆలస్యమైంది లంజెకు. ఎన్ని రోజులసంది సాగుతుందె ఈ భాగోతం చెప్పు, లంజె చెప్పు," అని గొడ్డును బాదినట్టు బాదబట్టిండు.

రెండేండ్ల లచ్చివి ఈ గోలకు లేసి ఏడుస్తావుంది. దాన్నోటి ఏసిండు. బిడ్డ గుక్కపెట్టి ఒకటే ఏడుపు.

"ఇంట్ల ఇంత మందివి వున్నం. ఏడంగ ఒస్తడురా ఒచ్చేటోడు," అనంగానే మా అత్తను గూడ నూకేసిండు.

"ఈనితోని ఎవడు బెట్టుకుంటడు," అనుకుంట మా అత్త ఎళ్లిపోయింది.

ఆని దెబ్బలు కాసుకునేటందుకే సరిపోతుంది.

"లంజె మాట్లాడవేందే," అని దొర్క పట్టుకొని గుద్దుతా వుండు.

బాడుకావ్‌కు నోరు తెరిస్తే లంజె అన్న పదవే దొరుకుతది.

''లంజోనికి లంజబుద్ధి.''

''నన్నే ఎదురంటున్నావే, మిండన్ని సూసుకునే నీకింత ధైర్నమొచ్చిందే,'' అని అలుపొచ్చేదాన్క వుతికిండు.

చీకటితోటి ఆకిలూకుతుండంగనే మా ఆడిబిడ్డ మొగడొచ్చిండు.

''బాగున్నవా అన్నా,'' అని పొరకాడ పడేసి పొయ్యి కాళ్లకు నీళ్లిచ్చిన.

''ఆ బాగున్న,'' అని కాళ్లు కడుక్కొని ఇంట్లకు బొయ్యిండు.

నా పన్ల నేను పడిపోయిన. అన్నం తిని ఒడ్లమిల్లు కాడికి పొయిన. ఒడ్లమిల్లు కాడికి పైసలు తీసుకునేటందుకు మా అత్తకు బదులు మా ఏరాలొచ్చింది. మా బావ వుద్యోగానికి పోలే. నా మొగుడు బయటికి పోలే. ఈళ్లు ముగ్గురు ఇంట్ల కూసొని పొద్దన్నుంచి గంటలు గంటలు మాట్లాడుకుంటున్నరు. ఏవోఁ గూడుపుఠాని జరుగుతుందేందో అనుకున్న. పన్ల బడి మర్చిపోయిన.

రాత్రి అన్నాలు తిన్నం. అన్నాలు తిన్న పళ్లాలన్ని కడిగి బోర్లిస్తుంటె మా ఆడిబిడ్డ మొగుడు, ''తాయమ్మా,'' అని పిల్సిండు.

''ఏందన్న.''

''ఇసుంటరావె.''

పొయ్యి నిలబడ్డ.

''మీ బావ జేబుల మూడొందల రూపాయలు పోయినంట.''

''అట్లనా. ఎట్ల బోయినయన్నా?''

''ఏఁవోనే. అదే తెలుస్తలేదు.''

''జేబుల పైసలు జేబులెట్ల మాయవైతయ్,'' నేను.

''అదే నేనంటున్న. ఎవలన్న తీస్తనే గద పొయ్యేది,'' ఆడిబిడ్డ మొగుడు.

నేనేం మాట్లాల్లే. అంత సప్పుడు లేకుంటుంది. మా అత్త సొపగిల్లుతుంది. మంచంల మా బావ సుట్ట తాక్కుంట కూసుండు. నా మొగడెందుకో సప్పుల్లేకుంట కూసుండు. ఏరాలు ఏవోఁ పనున్నట్టు ఇంట్లకు బయటికి తిరుక్కుంట మాటలింటుంది. దొంగతనం నామీద పెట్టేటందుకే గీ మాటలన్ని. కొంచెం సేపైనంక, మల్ల మా ఆడిబిడ్డ మొగుడే, ''తాయమ్మ నువ్వు గిన తీసినావే.''

''అన్నా పదకొండేండ్ల పిల్లను ఈ యింట్ల బడ్డ. నా సంగతి సూస్తలేరా?''

మా అత్త, ''అప్పుడప్పుడు పాతిక పర్క పోతనే వున్నయ్. ఇప్పుడు ఒందలకాడికొచ్చింది.''

ఆడిబిడ్డ మొగడు, ''తీస్తె చెప్పే తాయమ్మ. మీ బావకేదో అవుసరవున్నయంట. అయినా తీస్కొని నువ్వేం జేసుకుంటవుగని.''

నా కడుపుల పేగులు కుతకుత వుడుకుతున్నయ్.

''యీ యింట్ల నేనే సచ్చిన్నా.''

ఎంటనే నా మొగుడు మంచంల కూసున్నోడు జర్రిపోతోలే మీది కురికొచ్చిండు. మా ఆడిబిడ్డ మొగడాపి, ''ఏంది ఈశ్వరయ్య, నేనడుగుతనే వున్న గద. జరసను,'' అని మల్లి నాతోని,

''ఏవంటవ్ తాయమ్మ. పంచాతులు, దెబ్బలు, తిట్లు ఎందుకే చెప్పు.''

''మల్లట్లనే అంటరేంది. ఈ యింట్ల నేనొక్కదాన్నే వున్ననా?''

''సరే పెద్దదాని మీదనే గద నీ అనుమానం. దాన్ని సుత అడుగత. నువ్వు చేదు, అది తీపా?'' అని, మొగరాని కానుకొని నిలబడ్డ మా ఏరాలుతోని, ''సత్తెమ్మ నువ్వు దీసినావె.''

''లంజెలు నా మీదపడి ఏడుస్తరు. నా పిల్లల మీద పవాణం జేసి చెప్తున్న అన్న. నేను దీస్తె నా చేతులు బడిపోను. నా చేతులకు జెట్టబుట్ట,'' అని ఏడుస్తనే వున్నది. ఆళ్లందరు ఆమెని ఊకిస్తున్నరు.

''ఊకో సత్తెమ్మ. ఊకో... ఇద్దర్ని అడగాలని అడిగినం. నీ మీద అనువానం వుండిగాదు. నువ్వు తీసినవని గాదు.''

మరి నా మీదనే గద అనువానం. అదే నేనేడిస్తె లంజెది తీసి ఏవెర్గనట్టు ఏట్లేడుస్తుంది జూడు అనుకునేటోళ్లు.

''సరే ఇప్పటికే బాగా చీకటిపడ్డది. ఏదన్నుంటె రేప్పొద్దటికి మాట్లాడుకుందాం,'' అని ఆడిబిడ్డ మొగుడు కండువ దులిపి భుజం మీదేసుకుని తనకేసి వుంచిన మంచంలకు పొయ్యి పండుకుండు.

అయ్యాళ రాత్రి కంటిమీద కునుకులేదు. ఆ మూడొందలు నేనే తీసిన అనుకుంటున్నరు. ఈళ్లను వానం ఏంజేసి పొగొట్టాలె. దొంగతనం ఒప్పుకోకపోతే దెబ్బలు తప్పేటట్టు లేవు. సరే, నేనే తీసినని ఒప్పుకుందునా, ఏ దొంగతనం జరిగినా, ఏం బోయినా నా మీద పడ్తది. తిట్టటానికి సందిచ్చినట్లైతది. ఏం జేద్దును. ఇదే ఆలోచన.

తెల్లారింది లేసి ఆకిలూకిన. సాంపి జల్లి, ముగ్గేసిన. కోళ్లనొదిలిన. బర్లకాడ పేడ తీసిన. పాలు పిండి ఒంటింట్లకు తీసుకొచ్చిన. అందరు ఆన్నే వున్నరు.

"తాయమ్మ తప్పు ఒప్పుకోవే" ఆడిబిడ్డ మొగడు.
"చెయ్యని తప్పు నేనెట్ల ఒప్పుకుంట."

"మరి కాలే నూనెల పైస తీస్తవా?" ఆడిబిడ్డ మొగడు.

"ఆ... తీస్త. తడిబట్ట తానం జేసొస్త. పొయ్యి అంటించి నూనె బెట్టురి. కాని, నేనొక్కదాన్నే గాదు మా ఏరాలు కూడా తడిబట్ట తానం జేస్తది. నాతోబాటు కాలే నూనెల పైస దీస్తది."

మా ఆడిబిడ్డ మొగుడు బరబరా నామొగణ్ణి, మా బావను తీస్కోని దొడ్లకు బొయ్యిండు.

"తాయి తియ్యలేదు. అది అంత గట్టిగా మాట్లాడ్తుంది. సత్తెమ్మే తీసింది."

"లంజెది అట్లనే మాట్లాడ్తది బావ. దాని సంగతి నీకు తెల్వదు. రెండేస్తే అదే చెప్తది" ఈన.

"నా భార్య తియ్యలేదు. నేను పెద్ద మనుసుల్ల పెడ్త."

"నీ భార్యను కూడా తడిబట్ట తానం జేయమను," ఆడిబిడ్డ మొగడు.

"దానికే ఖర్మ. అది జెయ్యదు."

"ఏం మాట్లాడుతున్నవ్ నారాయణ. ఇంక పది మందిల పెడ్తనంటున్నవు. పెట్టు. పదిమందిక్కూడ తెలుస్తది. యింట్ల ముచ్చట బయిటెందుకు ఏస్తరయ్యా. పోరి. పోరి, ఎవరిండ్లకు ఆళ్లు పోరి," ఆడిబిడ్డ మొగడు.

ఏడోళ్లు ఆడికి పోయింండ్రు. ఎవలి పని ఆళ్లు జూసుకుంటున్నరు. మిల్లు పట్టుకుంట నేనున్న. మా ఆడిబిడ్డ మొగడు పొయ్యేటప్పుడొచ్చి, "తాయమ్మ పొయ్యస్తనే," అని చెప్పి ఎళ్లిపోయిండు.

*

పెద్దపిల్ల లచ్చిమికి ఆరో ఏడు పడ్డది. పెద్దోడు శ్రీనివాస్‌కు మూడో ఏడు. చిన్నోడు కడుపులున్నడు. నీళ్లు పోసుకున్నా పన్జెయాలె నీళ్లాడేదాంక. మల్ల తొమ్మిదోరోజు పురుడెల్లిన కాన్నుంచి పని చెయ్యాలె. సంక్రాంతి దగ్గరకొచ్చింది. బోగి ఎల్లుండనంగ అమ్మ ఒచ్చింది. అంతకు ముందు మున్నాల్గుసార్లొస్తె తోల్లేదు.

ఇంటెన్క బర్లకు కుడ్తి కలుపుతున్న అమ్మొచ్చింది. అందరు సూస్తనే వున్నరు గని ఎవరు సప్పుడు జేస్తలేరు. తౌడు అన్నే పడేసి ఉరికినట్టె పొయ్యి అమ్మ చేతిల సంచందుకున్న. కాళ్లకు నీళ్లు ముంచిచ్చిన.

అమ్మ కాళ్లు కడుక్కుంటూ "బాగున్నావురా తాయి."

"ఆ...." అనుకుంట తల్కాయూపిన. కండ్లల్ల నీళ్లు జలజలరాలుతున్నయి. దుఃఖమాగుతలే. ఏడాదిన్నర గావస్తుంది అమ్మను జూసి. అప్పుడే నెత్తంత తెల్లగ ముగ్గుబుట్టోదిగ అయ్యింది.

"ఏడుస్తున్నావురా తాయి."

లేదని తల్కాయూపి, కొంగుతోని కండ్లు దుడ్సుకొన్న.

"బానే వున్న గదరా. ఏడేడు మీద పడ్తుందిగద," అమ్మ.

ఏడాదిన్నర తర్వాత కల్సి ఒగరి కష్టాలొకరం, పలకరింపులు, ముచ్చట్లు అన్ని ఆ రెండు మాటల్ల అయిపోయినయ్. చెప్పుకుంటె తీరేటి కష్టాలు కావు.

అందరు 'బాగున్నవా' అని తర్వాత పల్కరించిన్రు. యింటికి ఏ చుట్టమొచ్చినా, పక్కమొచ్చినా కోడి తెగుతది. అమ్మ అందరితో పాటుగ ఆనక్కాయ కూరేస్కోని తిన్నది. కోడిగుడ్లు ఒండిన్రు. వాతవని అమ్మే స్కోలే.

ఒడ్లు పడ్తుంటె కాసేపు నా దగ్గర్నే కూసొని ఆ ముచ్చటీముచ్చట అడిగి, ఊర్ల సుట్టాలను మందలించొస్తని పోయింది. రాత్రి పోరగాండ్లిద్దరు ఆళ్ల అమ్మమ్మ కాన్నే పండుకున్నరు.

పాలు పిండిస్తె పాలుగాసుకుంట పొయ్యికాడ కూసుంది మా అత్త. మా ఏరాలు దూరఁవుంది. బాయిల నీళ్లు జేది పొట్టు పొయ్యి మీద నీళ్లు బెడ్తున్న. అడగనా అని అమ్మ సైగ చేసింది. పొయ్యాదుకుంట అడుగు అని తల్కాయూపిన.

ఒంటింట్లకు పొయ్యి, "ఒదినా పిల్లను పండుగకు తీస్కపోనొచ్చిన. అట్లనే కాన్పు గూడ జేద్దామనుకుంటున్న."

"దాని మొగడు సచ్చిండా నన్నడుగుతున్నవ్."

"ఇంత దాంక నిన్నడిగే తీస్కపోతిని గద. ఇంతెల్ల అంత కోపవేంది."

"కోపవేఁవుంది? ఇద్దరు పిల్లల తండ్రయ్యిండు. ఆన్నే అడుగు," అని లేసిపోయింది. పండ్లల్ల ఏపపుల్లేసి పండ్లు తొవుకుంటున్నడు. ఆయన దగ్గరికి పోయి అమ్మ, "ఈశ్వరయ్య, తాయమ్మను తీస్కపోనొచ్చిన."

"మిల్లుకు గిరాకుండేది ఇప్పుడే."

"మిల్లుకు గిరాకుండన్ది ఎన్నడు?" అమ్మ.

ఏవన్లేక, "మా అన్ననడుగు."

"తోల్తవో? తోలవో? నువ్వు జెప్పరాదా?" అమ్మ.

"ఇంటికి పెద్దోడు మా అన్నుండంగ నేనెట్ల జెప్త," అని మొఖం కడుక్కోని యింట్లకు పొయ్యిండు.

అమ్మ నాకాడికొచ్చి, "బిడ్డ! ఈపాలి కూడా పంపించ్చేటట్టు లేరు"

అమ్మ మొఖం జూసుకుంట అట్లనే నిలబడ్డ. ఏం జేయాల్నో తోస్తలేదు.

"సరే మీ బావను సుత అడిగి సూస్త," అమ్మ.

మా బావ అప్పుడే చంబట్క పొయొచ్చి చెంబు గోళంల ఏసి ఇంట్లకు బోతుండు. అమ్మ గూడ ఆయన ఎన్కాల్నే పొయ్యి "నారాయణ తాయమ్మను పండుగకు తీస్కపోనొచ్చిన."

"అమ్మనడగక పోయినవా?"

"అమ్మనడుగుతే ఈశ్వరయ్య నడగమన్నది. ఈశ్వరయ్య నడిగితె నిన్నడగమన్నడు," కొంచెం కోపం గనే అమ్మ.

"అత్త పంపిస్తది లేకుంటె మొగడు పంపిస్తడు. మధ్యన నేనెవర్ని పంపియటాన్కి," ఆయన గూడ కోపంగనే.

"ఇట్ల ఒగరి మీద ఒగరు పెడ్తె ఎట్లనాయిన. లచ్చిమి పుట్కల పంపిస్తిరి. ఆడిదాన్ని ఎన్నిసార్లని తిర్గ?" అమ్మ.

"బాగుందొరుస. నా మీద ఎగుర్తున్నవేంది. పొయ్యి దాని మొగని మీద ఎగురు."

"ఇండ్ల ఎగురుడేవుంది. నా బాధ చెప్తున్న," అమ్మ.

మా బావ యినకుంటనే ఎళ్లిపోయిండు. నా మొగుడు అప్పటికే బయటపడ్డడు. తెల్లార్తె బోగి ఆయన యింటికే రాలే.

అమ్మ చీకటితోనే లేసి మా అత్తకు పొయ్యొస్తనని చెప్పి నా కాడికొచ్చి, "ఈ రాచ్చసులు పంపియరు బిడ్డ. రేగ్గంపల బడ్తివిగదనే," అని కొంగుతోని కండ్లొత్తుకుంది.

నేనూ ఏడ్సుకుంట నిలబడ్డ.

"సరే పొయ్యొస్త బిడ్డ. ఒళ్లు మంచిగ జూసుకో."

"మళ్లెప్పుడొస్తవమ్మా?"

"కాన్పైనంక ఒస్తలే," అని అమ్మ ఎళ్లిపోయింది. అప్పటికి తెలతెలవారుతుంది.

ఎన్నడన్న పాణానికి నిమ్మలుంగింది లేదు. అమ్మ కాడికిపోతే ఉన్నన్ని రోజులన్న నిమ్మలంగుండొచ్చు. పాణం పీక్తా వుంది. దబదబ ఆకిలూకిన, సాంపేసిన. ఒక బట్ట తీసుకున్న. మంచంల పండుకున్న పెద్దోన్ని ఎత్తుకున్న. లచ్చిమిని గూడ తీస్కపోదావంటె ఆళ్ల నాయినమ్మ పక్కల పండుకున్నది. ఈన్నే వుండనియ్ ఏడికిబోతది. పాణం వూకుంటలే. బిడ్డను ఎట్ల జూస్తరో? ఏవో<? కాసేపు ఆడ్కీడ్కి తిరిగిన. దానికొరకు పోతినా మా అత్త జూసి, 'పొద్దున్నే పిల్లను లేపుతున్నవేంది,' అంటది. మా అత్త లేసిందంటె మల్ల బయటపడ సందు గాదు. ధైర్నం జేసి బయటపడ్డ.

సంక్రాంతి రోజులాయె. బాగా మంచు కురుస్తుంది. ఈడున్న మనిషి ఆడున్నోళ్లకు కనిపిస్తలే. ఉరికినట్టె పెద్ద పెద్ద అంగలేసుకుంట ఊరిబయట చెరువు ఎంట నడుస్తున్న. చెరువుకట్టకున్న చెట్టుకేసి సూద్దుగద అమ్మ ఆడ కూసొని ఏడుస్తుంది.

పొయ్యి మీద బడ్డ. అమ్మేడుసుడు, నేనేడుసుడు.

"ఎట్ల పంపించిన్రు బిడ్డ. అప్పుడు పంపియనన్రి."

"ఆళ్లకు జెప్పకుంటొచ్చిన."

"ఆళ్లకు జెప్పకుంట ఎందుకొచ్చినవే."

"మరేం జెయ్యాలి. చెప్తె ఆళ్లు పంపిస్తరా."

"సరే పా బిడ్డ. ఏఁవైతే అదైతది."

నేన్లేకపోతే ఆళ్లకెళ్లదు. నాలుగైదు రోజుల కొస్త రనుకుంటె రెన్నెల్లైంది, మూన్నెల్లైంది, ఆర్నెల్లైంది, ఏడాదైంది. పిలగాడు పుట్టిండని చెప్పంపినా రాలె. చిన్న పోరగాడు మొన్న ఆయెపాయె అన్నట్టు జేసిండు. అమ్మకు భయం పట్టుకుంది.

"ఆళ్లు రానట్టే వుంది. నేనొచ్చి తోలస్త పోదాం బిడ్డ," అమ్మ.

నాకు పిల్లమీద గుంజిస్తనే వుంది. పోరిని ఒదిలి పెట్టొస్తి. ఎట్లుందో ఏవో< అని. కని ఆడికి పోబుద్ధి గాట్లే.

"అమ్మా! సూసుకుంట మల్ల ఆ నరకంలకు పొమ్మంటావే."

"ఏం జేస్తం బిడ్డ. ఆడ్దాని బత్కే అంత."

"ఈన్నే వుంట."

"బిడ్డ అట్లనుకోకు. మన ఇండ్లల్ల ఎవ్వలిట్లన్లే."

"ఆడజేసే కష్టవే ఈడ జేస్క బత్కుతనే."

"అట్లనకు బిడ్డ. కష్టవైన, సుఖవైన, సావైన, బత్కైనా అక్కన్నే. పిలగాడు పుట్టి ఏన్నెల్లయ్యే. చెప్పంపితె రార్రైరి. ఈడికే ఏవంటరో? ఏవో<? అయ్యాల్నే తొందరపడ్డ. తిప్పి పంపిస్తె పోయేదాన్కి ఎంట బెట్టుకొచ్చిన."

పెద్దోడు ఏడుసుకుంట లోపలకొచ్చిండు. అన్ని ఒక్కటేసిన. అమ్మ పట్టిచ్చుకోనట్లే, 'రేపొద్దున్నే లేసి పోదాం. బట్టలు సర్దుకో,'' అని కోవటి రంగయ్య యింట్ల పెండ్లికి అరిసెలు చెయ్యటానికి పోయింది.

కాల్జెయాడ్తలే. ఆడికి పోవాలంటే పాణం మీద కొస్తుంది. అన్నం సయించలే. అట్లనే పండుకున్న. పోరగానికింత అన్నం తినిపించిన. చీకటి పడ్డంక అమ్మ

ఒచ్చింది. ''ఇంట్ల దీపవన్న ముట్టియ లేదేంది తాయమ్మ,'' అనుకుంట దీపం ముట్టిచ్చింది. బాసన్లు తోవటాన్కి గిన్నెలన్ని బయటేసుకుంట.

''తాయమ్మా! అన్నం తిన్లేదు,'' అన్నది.

కదల్లే మెదల్లే అట్లనే పండుకున్న.

పల్లెంల అన్నం బెట్టుకొచ్చి ముందల బెట్టింది. నేను ముట్టలే. అట్లనే పండుకున్న. అమ్మలేపి కూస బెట్టింది. కండ్లెంట నీళ్లు సుక్కలు సుక్కలు పల్లెంల పడ్తున్నయ్. అది చూసి అమ్మ గూడ ఏడుసుకుంట,

''తిను బిడ్డ తిను. తినకపోతే ఎల్తదా. నువ్వు కడుపు మాడ్సుకుంటె పోరగాన్కి పాలెట్లిస్తవు. మన రాతలే యిట్టున్నయి. ఆడిదై పుట్టేకంటే అడవిల మానై పుట్టడం మేలంట,'' అనుకంట అన్నం తినిపించింది. పెద్దోనికి తినిపించి పండబెట్టింది.

ఎండెల్లేసరికి యిల్లు జేరినం. ఇల్లూకుతున్న లచ్చివి పోరకాన్నే బడేసి పిట్టోలె ఉరికొచ్చి నడుం సుట్టు చేతులు బిగించి, కడుపుల మొఖంపెట్టి,

''అమ్మ నన్నొదిలి ఏడికిబోకే,'' అని ఎక్కిళ్లు బెడ్తుంది.

''ఇంకేడికి పోను బిడ్డ,'' అని బిగ్గర పట్టుకున్న. చేతిల పోరగాడున్నడు. దాని నెత్తికి నూనె రాసి ఎన్నా ళ్లైందో! సింపిరిగుంది. బిడ్డ బక్కగైంది. దాన్ని సూస్తె ఏడు పొగలె. నేను గూడ ఏడ్చిన. అది ఆళ్ల తమ్మున్ని సూస్తుంది. పుట్టిన కాన్నుంచి సూడలేదాయె. మద్య మద్యన పెద్ద తమ్మునితో మాట్లాడ్తుంది నవ్వుకుంట.

గిన్నెలు తోవుకుంట దొండ పందిరికాడ మా ఏరా లుంది. పొయ్యి మీద అలుక్కుంట మా అత్తుంది. బాయి మీద తానం జేసుకుంట మా బావ వుండు. పండ్లల్ల పుల్లేసి ఆయన. ఎవరు సప్పుడు జేస్తలేరు. చిన్నోన్ని సాపేసి, సాపల పండబెట్టిన. యింటెన్కకు పొయ్యి కాళ్లు కడుక్కున్న. అమ్మ కాళ్లకు నీళ్లిచ్చిన. ఇద్దరం మల్లొచ్చి వసారాల కూసున్నం.

బర్లకాడ పేడదియ్యలే. పేడదియ్యిపో అని అమ్మ మోచేత్తోటి పొడుస్తా వుంది. పొయ్యి పేడదీసిన. చూసి సూన్నట్టు ఊకున్నరు. మిల్లుకాడికి ఒడ్లొచ్చినయ్. ఎవరు పోతలేరు. ఒడ్లు తీసుకొచ్చినోళ్లు పిలుస్తున్నరు. ఒడ్లు పట్టుకుంట నేనున్న. పదయింది. లచ్చివికి, పెద్దోనికి బావ పిల్లలతోపాటుగ అన్నం పెట్టింగ్రు. అక్క ఎంట పెద్దోడుగూడ బడికి పొయ్యిండు. చిన్నోడు పాల్జీకి నిద్రపోయిండు. ఆనికి తానంలేదు బోనంలేదు. ఆయన ఇంట్ల నుంచి కాలు బయట పెట్టలే. మా సంగతేందో సూద్దావని కూసున్నట్టుంది. అమ్మను పలకరించలె. నన్ను పలకరించలే ఎవరు. తినమన్నోడు లేడు, తాగ మన్నోడు లేడు.

అమ్మ మిల్లుకాడికొచ్చి, ''పొయ్యొస్త బిడ్డ. జాగ్రత్త గుండు. ఎవ్వరు మాట్లాడ్తలేరు. కోపంగున్నరు. ఆళ్లే వన్నా.... నువ్వు సప్పుడు జెయ్యకు,'' అని,

''ఆళ్లు మాట్లాడినా మాట్లాడకున్న చెప్పి పోవాలె గద. మీ అత్తకుగిన చెప్పొస్త,'' అని లోపలికి పొయ్యింది.

''ఒదినా పొయ్యొస్త.''

''ఎవర్నడిగొచ్చింగ్రు. ఎవర్నడిగి పోతుంగ్రు.''

'ఏవన్న పంచాతి అయ్యేటట్టుంది. నా పోరిదే తప్పు,' అనుకొని బల్లపీట మీద కూసున్న ఆయన కాడికి పొయ్యి,

''పొయ్యొస్త ఈశ్వరయ్య.''

సప్పుడు లేదు. సరిలేదు. చెప్పులేసుకున్నదాంక చూసి,

''ఆగు, ఒక్కదానివే పోతున్నవేంది. ఎట్లొచ్చింగ్రో అట్లబోరి.''

''చిన్నపిల్ల తొందరపడి చెప్పకుంటొచ్చింది.''

''ఆ... చిన్నగొల్లి. ఏలుబెడ్తె జీకదు. ఎన్న బెడ్తె నాకదు. ముగ్గురి పిల్లల తల్లయింది. చిన్న పిల్లంట చిన్నపిల్ల,'' ఏరాలు.

ఇన్ని రోజుల నా పనంత ఆమె మీద పడ్డది. ఆ కోపమంతా ఎల్లగక్కుతుంది.

''పెద్దదానివి నీ బుద్దాడ పెట్టుకున్నవ్,'' ఆయన

''అట్లంటె ఏడికి బోతం. ఈ ఒక్కపాలికి తప్పు కాయుంగ్రి,'' అమ్మ.

''ఏడికి బోతరో మాకెర్కలేదు. ఆ... పోరగాడు ఎవనికి పుట్టిండు.''

''ఈని కాన్పుకే తీస్కపోనొస్తిని. అంతమాటనకు నాయిన. నీచేతులు బట్టుకుంట.''

''రంకు నేర్చినమ్మ బొంక నేర్చిందంట. ఎవనికి పుడ్తె నాకేంది. ముందు బయటికి నడువురి.''

శివాలెత్తుతుంది నాకు. ఆన్నాలుక తెగ్గోస్తె బాగుండు. పొయ్యి ఏడాదైతుంది. ఏన్నెల్ల పిలగాడె ట్లుండు. పొయ్యేనాటికి అంతెంతు కడుపుంది. ఆడు మనిషా పసురవా అర్థమయితలే.

అమ్మ ఊర్లకు పోయి తిరిగి తిరిగి ఇద్దరు కుల పోల్లను ఎంటబెట్టుకొని ఒంటి గంటకు మిట్ట మధ్యాహ్నం ఒచ్చింది. కడుపుల మంచినీళ్లు గూడ పొయ్యలే.

"ఏంది ఈశ్వరయ్య ఏవోఁ అన్నవంట. ఎంకటక్క ఒచ్చి ఏడుస్తుంది."

"నేనేవన్న ఎట్లొచ్చినోళ్లను అట్ల బొమ్మన్న."

"ఇయాల కొత్తగొచ్చినట్టు మాట్లాడుతున్నవేంది. ఏడికి బోతరు?"

"లంజదానికి పోరి ఈడ వుందన్న సోయన్న వుందా? ఎగేస్కాని వురుకుతాదె చిన్నాయిన."

"మీరు తోలియకపోతె ఏంజేస్తది. అషడ, ఐదా రేండ్లు ఎవలయ్యా తల్లిగారింటికి పంపియన్డి."

"నీకు తెల్వది చిన్నాయిన. దానికాడ మిండ డున్నడు. పోయినదెవతన్న వారం దినాలకొస్తది, పద్ది నాలకొస్తది. ఏడాద్దాన్క ఎవతుంటది."

"ఏం మాట్లాడ్తున్నవో తెలుస్తుందా ఈశ్వరయ్య. అవును పిలగాడు గూడ నాకు పుట్టలేదన్నవంట. ఎవర న్నింటె నవుతరు పిలగాడు నీకు పుట్టలేదంటె. అందర్కి కన్పించిన కడుపు మీకు కన్పించలేదా?"

"ఏం ఒదినా నువ్వు గూడ సప్పుడు జెయ్య వేంది," మా అత్తను.

"నేనేవంటున్న మద్దెన నన్నంటుంండ్రు."

"నువ్వన్న జెప్పొద్దా?"

"నేన్జెప్పేదేవుంది. ఆనికి తెల్వదా?"

"మాట్లాడిన కాడికి సార్లేరి. పలనా తాయమ్మ యిట్లాంటిదని ఊర్ల ఎవర్నన్న ఏలెత్తి సూపియమను," అని, "ఏం తాయమ్మ పంపియకుంటె అట్లబోతె తప్పు కాదా? ఈపాలట్ల జేసేవు."

నేను ఒక్కటన్లే రెండన్లే.

చెప్పి ఆళ్లెళ్లిపోయింండ్రు. అమ్మ సంచి చేతబట్టు కొని నాకాడికొచ్చి, "తాయమ్మా పొయ్యొస్తనే. నా యింటికి మల్లెప్పుడు రాకు బిడ్డ. నాకు చిక్కులు తేకు. మనకు ఇటోడు లేడు, అటోడు లేడు."

"అన్నం తిని పోరాదు రెండయ్యింది."

"వద్దు తాయమ్మ. కడుపు నిండిపోయింది ఈడికే," అని ఎనక్కు సూడకుండ సర్రసర్ర ఎళ్లి పోయింది. కన్పించకుంట పోయేదాన్క ఏడుసుకుంట ఆన్నే నిలబడ్డ. వున్న ఒక్క ఆధారం తెగిపోయింది.

*

ఊరికి సర్పంచయిండు. ఊర్ల పంచాతులు చెప్పుడు, ఊరి మీద బడి తిరుగుడు. కష్టంజేసి యింట్లకు ఒక్క పైస తేలే. పొలమ్మీద ఒచ్చిన పైసల లెక్క సరిగ జూపిస్తలే. జల్సాలకు పెట్టుడుతోనే సరి పోతుంది. పొత్తుల సొమ్ము నాశనం జేస్తుంటే మా బావ వూకుంటడా?

మా బావ కొడుకు, చిన్నోడు గోళీలు ఆడుకుంట కొట్లాట బెట్టుకొని, మా చిన్నోడు ఆడనని వస్తుంటె, "పోరా లంజెకొడుక. ఓడిపోతున్నని పోతున్నవ్."

"నేనేం ఓడిపోతున్నని పోతలే. నువ్వే అంత తొండి తొండి ఆడుతున్నవ్," అని, నా కాడికొచ్చి "అమ్మా, అన్న నన్ను లంజెకొడుకంటుండే," అని చెప్పిండు.

"అంటె అన్నడులేరా. అట్లంటె అన్న నోరే పడి పోతది."

మా ఏరాలు అందుకొంది. "ఎవరి నోరే పడి పోయేది. నా పిల్లలమీద బడి ఏడుస్తుంండ్రు. నీ మొగుడు సంపాయించి పెడ్తున్నాడే. యీ యింటికి శనోలె పట్టింండ్రు," అని పెద్ద పంచాతి పెట్టుకొని, తల్కాయకు గుడ్డ కట్టుకొని పండుకుంది. రాత్రి అన్నాన్కి పిలిస్తె రాలె. మొగుడు, పెండ్లాలు ఏఁవేఁవి మాట్లాడుకున్నరో. పొద్దున్నే పయినవై తల్లిగారింటికి పోయింది. రెండు మూన్నెలైతుంది ఈడికి రాలె. మా బావ రెండురోజులు అత్తగారింట్ల, రొండు రోజులు ఈడ వుంటుండు. కొసకు ఓనాడు పొద్దున్నే,

"ఏంరా ఈశ్వరయ్య, ఏరుపడ్తెగని మీ ఒదిన రానంటుంది."

"ఇప్పుడేవైందన్న."

"ఆడోళ్లిద్దర్కి పడ్తలేదు గద."

"ఈపాలి ఒదిన జోల్కి ఒస్తె లంజదాన్ని తోడ్కలు తీస్త."

"పొత్తుల ఎన్నేండ్లని వుంటంరా."

ఏరు పడ్తున్నవని చెప్పంపితే మా ఏరాలొచ్చింది. చిన్నది వినోద పుట్టి వారం అయితుంది. పురుడెల్లన్ది బయటికి రావద్దాయె. పెద్ద మన్సులను, మా ఆడిబిడ్డ మొగన్నిగిన పిల్సింండ్రు. ఆళ్ల పాల్లు పంచేకాడికి నేను పోలె.

పొలాలు, చెల్కలను ఐదుపాల్లు చేసి, రొండ్రొండు పాల్లు అన్నదమ్ములకు ఒక పాలు మా అత్తకు పంచిన్రు. మిల్లు పట్టుడు మా ఏరాల్కు రాదని నాకే యిచ్చిన్రుగని, మిల్లుకు పైసలు కట్టియాలె. ఇంట్ల సామాను నా పెండ్లప్పుడు పెట్టిన కాళ్లు కడిగిన తాంబాలం, రొండు పల్లాలు, రొండు మంచినీళ్ల చెంబులు, ఒకటి దొడ్డికి పోయే చెంబు, బొట్టుపెట్టె, ఓ సందుక దానదంటకు ఓ నాల్గు గిన్నెలిచ్చింండ్రు. మిగిల్నియి ఏమియ్యలే. అయ్యి నా మొగుడు కష్టంజేసి కొన్నయి గావంట. ఇల్లును రెండు పాల్లు జేసిన్రు. ఏరే

కాడున్న నాలుగ్గుంటల జాగను మా అత్తకిచ్చిన్రు. మా అత్తను యాడిష్టవైతే ఆడుండవన్నరు. లేకుంటె ఆఁవె కిచ్చిన జాగల రొండ్రలు ఏసిస్తవన్నరు.

"యిన్నేండ్లు పొత్తుల కల్సున్నరు. నీకు ఆడ పిల్లలు లేరైరి. ఈశ్వరయ్యకు ఇద్దరైరి. పెద్దదాని పెండ్లి పొత్తుల జెయాలే," అని పెద్దమనుషులు.

"పిల్లగాన్ని యాడ జూడాలె," బావ.

"యాడ సూసుడేందిరా అక్కకొడుకు ఎంకటేశం వుండనే వుండె," అత్త.

"ఏం రాజయ్య నీ కొడుక్కి లచ్చివిని జేసు కుంటవా?" పెద్దమనుషులు ఆడిబిడ్డ మొగునితో.

"అది పుట్టినకాన్నుంచి పేరేబెట్టిరి నా కొడుక్కని."

"నువ్వు ఏఁవంటవు ఈశ్వరయ్య," పెద్ద మనుషులు.

"బావ ఒప్పుకున్నంక నేనదేఁ వుంది. ఎప్ప ట్నుంచో అనుకున్నదే గద," ఈన.

"మరి పెండ్లెప్పుడు పెట్టుకుంటరు" పెద్ద మనుషులు.

"సంక్రాంతి ఎల్లినంక," బావ.

"ఇన్నేండ్లు కల్సున్నరు. పిల్ల పెండ్లయిందాంక ఈ నెలపదేను రోజులు కల్సుండురి."

మల్ల నా బిడ్డను ఈ కంపల్నే పడేసుడిష్టంలే. లచ్చివిని మీ ఆడిబిడ్డ కొడుక్కిస్తవా? అని నన్ను అడిగి నోడే లేడాయె. అయినా నేనొద్దంటె యినేటోల్లెవలు. నాకట్లనే చిన్నతనాన జేసింండ్రు. నా బిడ్డకట్లనే జేస్తుండ్రు. నా బిడ్డ గూడ నా లెక్క పెద్దమనుసుల్ల బొమ్మయింది.

*

ఏరుబడ్డ కాన్నుంచి యింటికి గూడ సరిగ్గొస్త లేడు. పొలం మీద ఎన్నొడ్లు పండినయో, ఎటు బోతు న్నయో తెల్వదు. ఒడ్లు పట్టుడుతోనే సరిపోయింది. పొలందిక్కు సూడలె. ఆ పైసలెట్లయిన యింట్ల కియడు. కల్లంకాడి ఒడ్లు కల్లంకాన్నే అమ్ముతుండు. ఒక్క గింజ యింటికి రాలె. మిల్లు మీదనే యింట్ల కెల్లుతుంది.

ఒడ్లు పట్టించుకుంటున్న గౌండ్ల ముత్తమ్మత్త, "ఏం కోడలా చెరువు కింద పొలవమ్ముతుండ్రు. అంత మంచిగ పండే పొలాన్ని ఏం కష్టవొచ్చిందని అమ్ముకుం టుండ్రు. ఓ పొలమమ్మితే మల్ల కొనటానికి కుదు రుద్దా?"

మిల్లు సప్పుడుకు మాటలు సరిగిన్పిస్తలెవ్. బేజా రయి మిల్లు బంజేసి, "ఏందత్త ఏవోఁ అంటున్నవు. ఏ పొలం, ఎవలమ్ముతుండ్రు?"

"అయ్యో... నీకింక తెల్వదా? మీ పొలవేఁ. మీ ఆయనే అమ్ముతుండు. షానా అగ్గవకు."

"ఎవరు కొంటున్నరత్త."

"ఎంకటికి అమ్ముతున్నడు."

"ఏ ఎంకటి?"

"ఏ ఎంకటో నీకు తెల్వదా?"

"తెలిస్తె మల్లెందుకడుగుతత్త," నాకేవోఁ ఆత్రం ఎక్కువైతుంది.

ఆమె గుసగుస, "మీ ఆయన అలవాటైన ఎంకటికే," గొంతు పెంచి, "ఊర్ల అందరికి తెలిసిందే యిది."

"ఏం జెయ్యాల్నో ఎటు దోస్తలే. జర జెప్పత్త."

ఎవని కాడికిపోదును. ఎవలతోటి చెప్పిస్తె యింటడు.

"నేనేం జెప్త. ఆయనే ఊరికి పెద్దమనిషాయే," అని, "నేన్జెప్పిననిగిన చెప్పేవ్. మల్ల ఊర్ల బత్క నియరు."

"నీ పేరెందుకు చెప్తత్త."

ఆవెఁ ఒడ్లు పట్టించుకొని ఎళ్లిపొయింది.

కష్టం జేయకపోతే జేయకపాయె. ఉన్నదాన్నన్న పిల్లలకు వుంచేటట్టు లేడు. కాలాడ్తలే. చెయ్యాడ్తలె. బతివాలైన భూఁవిని కాపాడుకోవాలె. నేను బతిమాల్తె ఇంటడా? యినడు. ఏవోఁ పిల్లల మొఖవన్న జూసి యింటడేవోఁ.

ఎదుర్చూసి ఎదుర్చూసి కండ్లు లొట్టలకు బొయి నయ్. ఎన్నడన్న ఈనికొరకు ఎదురుసూల్లే. పన్నెం డింటికి ఒచ్చిండు. పీటేసి అన్నం బెట్టిన. అన్నం తిన్నడు. పల్లెం కడిగి ఒచ్చేసరికి పండ్లల్ల పొర్కపుల్లతోని గెలు క్కుంటుండు.

"పొలవమ్ముతున్నవంటగా."

"అవునమ్ముతున్న."

"నాకొక మాటన్న జెప్పలే."

"అన్ని నీకు జెప్పి చేయాల్నా?"

"ఇప్పుడేఁ అవసరం ఒచ్చింది."

"ఏం అవసరమైతె నీకెందుకు? నా పొలం నేనమ్ముకుంటున్న. నీయమ్మదమ్ముతున్ననా?"

"ఇప్పుడు నా అమ్మ సంగతెందుకు."

"లేకుంటె నీ తల్లిగారింటి కాన్నుంచి తెచ్చినట్టు మాట్లాడ్తున్నవ్."

ఈ బాడుకావ్ ఇట్లనే మాట్లాడ్తడు. కోపవేఁవో ముంచుకొస్తుంది. కని ఆపబట్టుకున్న. పేదోని కోపం పెదవికి చేటంట.

“పిల్లల మొఖవన్న జూడు. ఇంకో పోరుంది. తర్వాత పోరగాండ్లు బతికేదెట్ల.”

“నాకు పుట్టిన పిల్లలైతెగద.”

“చెప్పుకు పియ్యంటిచ్చి మూతి మీద కొడ్త.”

“లంజె చెప్పుకు పియ్యంటించి కొడ్తవె. వామ్మ వామ్మ ఎంత పొగరుబట్టిందే నీకు,” అని నాల్క సందు లేకుంట కొట్టిండు. రొండు రోజుల్లేవలె. ఒడ్లు ఒచ్చి పోతున్నయ్. పోరగాండ్లకు ఒండి పెట్టేటోడు లేడు. ఆడు యింటికొచ్చి చూసి పోతుండు. మూడోనాడు లేసి మల్ల పన్లబడ్డ.

మధ్యానం ఒడ్లురావు. అయ్యాళ బేస్తారం. తెల్లార్తె శుక్రవారం. ఇల్లన్న అలుకుదామని ఇల్లలుకుతున్న. ఒచ్చిండు. అమ్మో.... ఎన్నడ్లేంది పగటి పూట ఒచ్చిండేందో... అనుకున్న.

ఇద్దరు పోరగాండ్లు బడికి పోయింఢ్రు. చిన్నపిల్ల ఆడుకుంటుంది. రమ్మని పిలిసిండు. అది బయపడి పోలె. రెండు పైసల బిళ్ల జేబులకెల్లి తీసి చూపిచ్చు కుంట పిలుస్తుండు. అది చూసుకుంట అట్లనే నిల బడ్డది - పొయ్యి దాన్నెత్తుకుని ఒళ్ల కూసబెట్టుకొని ఆడి స్తుండు. ఎడవఁ చేత్తోటన్న ముట్టుకోనోడు ఒళ్ల కూస బెట్టుకొని ఆడిస్తుండేందో! పురైగిన తిరిగిందేవో! అను కుంటున్న ఇంతెల్ల పోరిని దించి,

“అమ్మను పిలుస్కరాపో.”

“అమ్మా నాయిన పిలుస్తుండే.”

చేతుల పిడుస చేతుల్నే పట్టుకొనిపొయి నిలబడ్డ.

“గుట్టకల్లి రొండెకరాల కంది చేను కొంటున్న.”

భూవులమ్ముతున్నపుడు జెప్పలే. ఇప్పుడెందుకు జెప్తుండో అనుకొని, “అట్లనా.”

“పైసల్తక్కువబడ్డయ్.”

అసలు పైసలుంటె గద తక్కువపడ్డానికి. నేను సప్పుడు జెయ్యలే.

“మిల్లమ్ముత.”

“ఇంట్లకెల్లెల్లుద్ది.”

“చెల్క కొంటున్న గద.”

పొలాలు, చెల్కలు వున్నప్పుడే యింట్లకు ఒక్క పైసియలే. ఇప్పుడు రొండెకరాల చెల్కతోటి ఎల్లదీస్త డంట. చెల్క మీద పండినా, ఒచ్చేదెన్నడు సచ్చేదెన్నడు. తెలుస్తనే వుంది పైసల్దేనికో.

“చెల్కతోటి ఇంట్లకెల్లుద్దా.”

“అయినా నేను బెట్టిన మిల్లది. నా మిల్లు నా యిష్టమొచ్చినట్టు చేసుకుంట.”

“నీ మిల్లయితే దానిమీద ఇన్నేండ్ల సంది కష్టం జేసిన. ఇప్పుడు నీ మిల్లు నా మిల్లని గాదు. ఇంట్లకు ఎట్లెల్లాలి?”

“పొలవమ్ముతున్నప్పుడు షెకల బడుకుంట పోరగాండ్ల మొకం జూడవంటివి. ఇప్పుడు భూఁవి కొంటంటె తాకటబెడ్తవు.”

ఈనితోని ఏఁవని లాభం లేదు.

“ఇండ్ల తాకట బెట్టుడేఁ వుంది.”

“మిల్లమ్మనియ్యక పోతే నీ నగలియ్యి.”

“యియి నా తల్లిగారు బెట్టినియి.”

ఆనికి కోపం వూటగయితుంది. ఇంతసేపు నిమ్మ లంగ మాట్లాడిండు. ఇంకాసేపుంటె పంచాతైతట్టుంది. పంచాతంటె తిట్లు, దెబ్బలేనాయె. యిల్లలికేటందుకు ఎనక్కు తిర్గిన.

“ఆగే లమ్డిముండ. మనిషి మాట్లాడ్తుంటె అట్ట బోతవ్.”

“ఆగి ఏం జెయ్యాలి.”

“ఇందాకట్నుంచి నిమ్మలంగ మాట్లాడ్తుంటె నీ కండ్లు నెత్తికెక్కుతున్నాయే. నీ నగలన్నియ్యి మిల్లన్న మ్ముత,” లేసి నిలబడ్డడు.

“నగలియ్య, మిల్లమ్మనియ్య.”

“లంజది మాటకు మాట ఎదురుచెప్తుంది,” అని జుట్టుపట్టి కాళ్ల మద్దెన యిరికించుకొని నగలు గుంజుక పొయిండు.

ఈ గోలకు పోరి గుక్కపట్టింది. బాడుకావ్ ఒక్కొక్కదాన్నే అమ్మేస్తుండు. ఇంక ఇప్పుడేఁ వమ్ము తడో? నగలు పోతే పొయినయ్. ఈపాలి మిల్లు ముచ్చట దియనీయరాదు. నగలు ఇయాల గాకపోతే రేపన్న జేసుకుంట. అయినా అయివుండేం జేస్తున్నయి. మిల్లమ్ముతే నోట్ల మన్నుబడ్డట్టే. ఈడెన్నడు కష్టం జెయాలె. ఎన్నడు బెట్టాలె.

దసరా పండుగకు లచ్చిమిని తీస్కరమ్మంటె పొయి తీస్కొచ్చిండు. ఇప్పుడు దానికి పద్నాలుగో ఏడు. బానే ఎదిగింది. కట్టెపుల్లోదిగ అయ్యింది. ఆడ జైళ్ల వున్నట్టుంది బిడ్డ. ఈడుకొచ్చి పిట్టోదిగ తిరుగుతుంది. తిర్గనియ్ అనుకున్న.

కోడి గూయంగ లేసిన ఆకిలూకిన, సాంపిజల్లిన. గిన్నెలు తోమిన, పొయ్యిలికి కలికుండల్నుంచి కలి ఒంపి పొయ్యి మీద ఎసరు బెట్టిన. బియ్యం గాలిచ్చిన. ఇంతెల్ల తెలతెలవారుతుంది. కోళ్లగూట్ల ఓ లావు పుంజును బట్టి గంప కింద కమ్మి, మిగిలిన వాటిని

ఒదిలిపెట్టిన. ఇంతెల్ల ఎసరొచ్చింది. ఎసట్ల బియ్యమేసి మొఖం కడుక్కున్న. అన్నం వుడికితే ఆరబెట్టి, పొయ్యి మీద నీళ్లు పెట్టి పోరగాండ్లను లేపి మొఖం కడుక్కొమ్మని ఇంటెన్కలకు తోలిన. పక్కలు దీసి ఇల్లూకిన. ఆయన ఎప్పటోదిగ చీకటితోనే బయటపడ్డడు. పోరగాండ్లకు తానం జేపిచ్చి, కోన్ని గోసి కూర ఒండేసరికి తొమ్మిది తొమ్మిదిన్నరయింది. అప్పటికే ఒడ్లు ఒచ్చినయి. నీళ్లు కాగినయ్, తానం జేసొస్తనని ఒడ్లు తెచ్చి నామెని కూసబెట్టి, తానంజేసి, పోరగాండ్లకు కూడుబెట్టి, నేను గూడ దబదబ రొండు ముద్దలు మింగి ఒడ్లు పట్టుకుంటు వున్న. ఒకరి తర్వాత ఒకరు తెగకుంట ఒస్తనే వున్నరు. పన్నెండయ్యిందట్టుంది.

పెద్దోడు, "అమ్మా నాయిన పిలుస్తుండే."

"అట్లనారా? ఎప్పుడొచ్చిండు. నేను జూడక పోతి."

"చానాసేపైతుంది. ఇంటెన్క నుంచి ఒచ్చిండు."

"మరి ఇందాకన్నుంచి చెప్పలేదేందిరా."

"ఆడుకుంట మర్చిపోయిన్నే."

"అక్క లేదుర."

"ఆళ్ల దోస్తులిండ్లకు పొయ్యింది."

"సరే పా నేనొస్తున్న."

ఆడుకునేటందుకు పోతుంటె, "తమ్ముడు, చెల్లె యాడున్నర్రా."

"ఆడుకునే కాన్నే వున్నరు," అనుకుంట ఉరికిండు. ఏవఁన్న పన్జెప్తనేవో అని.

ఒకావెయి పట్టి, రెండోగావెయి మెరిగెలకు పెట్టి, పొయ్యి (మొదలు పట్టినప్పుడు సగం బియ్యం, సగం మెరిగెలుంటయ్. అప్పుడు మిల్లుకాడ వుండాల్సిన పన్లేదు. రొండోపాలి పోసినపుడు మెరిగెలు లేని బియ్యం ఒస్తయి) చేతులు కడుక్కునేటందుకు చెంబుతోటి నీళ్లిచ్చి, "మిల్లుకి గిరాకీ బాగొచ్చింది ఇయ్యాళ," అన్న.

చెంబు తీస్కొని చేతులు కడుక్కోటానికి బయిటికి పొయ్యిండు. పోరగాండ్లు తిన్న ఎంగిలి పల్లాలు ఒంటిట్లనే వున్నయి. అన్నాన్ని ఇంటి నిండ కళ్లం లెక్క జల్లిండ్రు. ఎంగిలి పల్లాలు తీసి దబదబ ఊకి పీటేస్తె ఒచ్చి కూసుండు. అవుతల మెరిగెలు అయిపోయినయేవోఁ అని ఆత్రపడుకుంట అన్నం బెట్టి కూరేసిన. చెంబుతోని మంచినీళ్లు ముంచి పెట్టిపోతుంటె పల్లాన్ని కాలుతోటి ఒక్క తన్ను తన్నిండు. అన్నం, కూర కింద పోయినయ్.

"ఏంది అన్నాన్ని అట్లదంతవ్. అన్నవేఁవన్నది."

అవుతల ఒడ్ల మిల్లుకాడోల్లు తాయమ్మో... ఒడ్లయిపోయినయ్ జల్ది రామ్మో... తాయమ్మో... అని పిలుస్తుండ్రు.

"పిల్సేదాక రావు లంజె. కోడిముడ్డి, అన్ని బొక్కలే ఏస్తావ్ సువ్వర్ ముండ. మంచి మంచి తున్కలన్ని మీరు దింటరు? నేనంటె నీకు లెక్కలేదు. గంటసేపు ఎదురుచూడాల్నానే అన్నం కొరకు," అని పొయ్యిల కొరకాసు దీసుకొని కొడ్తావుండు.

సూడసూడవంట గంటెకు బొక్కలు, ముడ్డే రావాల్నా? అయినా ఆ బొక్కలు ఆయన తినకుంటె మేవేగద తినేది. ఒక్కనాడు పడ్తె ఎట్లెగురుతుండు జూడు. ఎప్పుడు మేవెట్ల తింటఁవ్. లెస జాగొస్తది ముండకొడుకులకు.

"నువ్వొచ్చింది నేన్జూల్లేదు. కావాల్నని రాలేదా ఏంది?" మొత్తుకుంట ఇంటెన్క కురికిన.

అట్లనే ఎంటబడ్డడు. బాయిసుట్టు తిర్గిన. బాయిసుట్టు తిరుగతనే వుండు. కొంగందుకుండు. కొంగు గుంజుకుంటే బాయిపక్కనున్న దొడ్డ పందిరి కింద జొరబడ్డ. ఆడూ జొరబడి బయటికి గుంజి గొడ్డును బాదినట్టు బాదిండు. కొంగంత చినిగింది. గాజులన్ని పగిలినయి. ఏడి దెబ్బలు ఆడ్నే పొంగినయి.

ఈ గోలకు మిల్లుకాడున్నోళ్లందరు ఒచ్చి సూస్తున్నరు. ఎవరికి అడ్డం ఒచ్చే దైర్నంలేదు. ఊరికి సర్పంచాయె. అప్పుడు, కట్టె ఆడ పడేసి దోతి గోషి మంచిగ పోసుకుంట,

"లంజ కాలుగోరుతో తీసేస్తుంది," అనుకుంట దోతులన్ని బ్యాగుల పెట్టుకొని ఎళ్లిపొయిండు.

ఏడుసుకుంట ఒచ్చి ఇంట్ల కూసున్న. మిల్లుకాడోళ్లందరు ఎవలొడ్లు ఆళ్లు తీస్కొని పొయిండ్రు.

ఏడ్సేడ్సి సొమ్మ ఒచ్చినట్టయి ఆన్నే గోడకానుకుని నిద్రపోయిన. పోరగాండ్లు ఆడుకొని ఆడుకొని పొద్దుగూకాల ఒచ్చి, "అమ్మా... అమ్మా," అని గుంజి లేపేదాంక మెల్కరాలె. కోళ్లు ఇంటినిండ కొక్కరకొక్కర అరుస్తున్నయ్.

"పెద్దోడ జర కోళ్లను గమ్ముమ్మ నాయిన," అనంగానే కొడుకులు కోళ్లను బట్టి కమ్మిండ్రు పెద్దోడు, చిన్నోడు. చిన్నదొచ్చి ఒళ్ల కూసుంది.

"అక్క రాలేదురా ఇంకా... ఇది ఎటుబోతె అటే."

"అక్క ఆళ్ల దోస్తింటి కాన్నుంచి పెదనాయినోళ్లింటికి పొయ్యిందంట. రాత్రికి ఆళ్లింట్లనే భోజనవంట. ఆన్నే పండుకుంటుందని అన్నొచ్చి చెప్పిపొయిండు."

ఏరుబడ్డాంక మా ఏరాలోల్లు పాలుకొచ్చిన యిల్లమ్మి ఊరిబయటికి పొయి జాగ్గొనుకొని మంచిల్లు కట్టించుకున్నరు.

చిన్నది, చిన్నోడు, "అమ్మ ఆకలైతుందే."

"నాయినా కుండల అన్నం వుంది. చెల్లెకు, తమ్మునికి బెట్టి నువ్వింత తిన్రా."

"అర్రల చీకటిగుంది. భయమైతుంది. నువ్వు ఒచ్చి పెట్టు."

లేసి దీపం ముట్టించి అన్నాలు పెట్టిన. ఒళ్లంత పచ్చి పుండు లెక్కైంది. పక్కలేసి పండుకున్న. పోర గాండ్లు అన్నాలు తినొచ్చి పక్కలబడ్డరు. ఇంటి ముందల తలుపుకు, ఇంటెన్క తలుపుకు గొళ్లెం పెట్టి పండుకున్న.

ఏంది ఈ బతుకు. ఒంటిమీద దెబ్బ పడని సోటు లేదాయె. నాలుకొక్కటే సందు. ఎన్నాండ్లని యిట్ల బత్కాలె. ఎన్నడన్న కడుపునిండ తింటినా కంటినిండ నిద్రపోతినా. పక్కాలింటికి పోతినా. తల్లిగారిల్లు మర్చి ఎన్నేండ్లాయె. ఈన్ని జేసుకొని ఏం బాఁవుకున్న. ఇగ సక్కగైతడేవోఁ.... అగ సక్కగైతడేవోఁ అని ఎదుర్సూసి ఎదుర్సూసి కండ్లు లొట్టలకు బొయినయి. కడుపు ఎన్ను కంట్కపోయింది. ఎన్ను ముందలి కొచ్చింది. సస్తె ఒక్క పాలె పీడబోతది. పోరగాండ్లు ఎట్లన్న బత్కకపోరు. యిట్ల ఆలోసించుకుంట కునుకు దియలే.

కోడి కూయంగనే లేచి, అన్నం ఒండి పోర గాండ్లకు యిద్దరికి అన్నాలు పెట్టి బడికి తోలిన. పోర గాండ్లు బడికి పోయేటాల్లకు లచ్చిమొచ్చింది. ఉన్న కొన్ని కట్టెలతోటి యిప్పటిదాంక ఎల్లింది. లచ్చివికి చిన్నదాన్నిచ్చి,

"లచ్చివి కట్టెలకు పోతున్న. చెల్లెనెత్తుకొని పెద నాయినింటికి పో బిడ్డ."

"నిన్న నాయిన కొట్టిండంట గదనే," కండ్లల్లకు నీళ్లొచ్చినయ్ బిడ్డకు.

"మీ నాయిన కొట్టద్దెన్నడు లచ్చివి?"

"కట్టెలకు రేపు పోదువులేరాదే."

"పొద్దడికి లేవు బిడ్డ."

"చెల్లెని పెదనాయినింటికాడ యిచ్చి నేను గూడ ఒస్త," అని పోతనే వుంది.

"నువ్వెందుకే. కొన్నే కొట్టుకొని జల్దొస్తగా" అని యింటికి తాళంబెట్టి బైటపడ్డ. ఊరి బయట చెరువుకట్ట దాటి, కోంటోల్ల పొలాలు దాటినంక తుమ్మచెట్లుం టయ్. చెట్లు నరికిన. మోపెడు లావు లావు కట్టెలు కొట్టి తాడు గట్టి, దారెంట పోయేటాయన్ని పిల్సి మోపె త్తించుకున్న. ఎండ బానే పెరిగింది అప్పటికి.

కట్టెల మోపెత్తుకొని కోంటాయన పొలంల వున్న పెద్దబాయి రాంగనే కట్టెలమోపు ఆడెత్తేశిన. బిగ్గరిగ గోసి పోసిన, కొంగు నడువుకు జుట్టిన. బాయిగట్టు మీద నిలబడి మా నాయినను తల్సుకున్న. ఒక్క అడుగు ముందలికేస్తే బాయలపడ్త. కండ్లు మూసుకున్న. నా పిల్లలు ఏడుసుకుంట కండ్లల్ల మెదిలింద్రు. రెండ డుగులు ఎనక్కేసిన.

నేను జస్తె నా పిల్లలకే గద తల్లి కరువయ్యేది. ఆనికి పెండ్లాన్ని కరువైతనా? ఆడు నేన్జస్తే ఇంకో పెండ్లి జేసుకుంటడు. సుఖంగ వుంటడు. నేనుండంగానే నా పిల్లల మొఖం జూస్తలేడు. నేను జస్తే పట్టించు కుంటడా. నా పిల్లల కొరకన్న బత్కాలి.

బాడుకావ్ బట్టలు మూటగట్కపోయి బెదిరిద్దా మనుకుంటుండేవో? ఆడు యింటికొచ్చిన్నాడే ఆయే. రాకుంట రాకపోయే. ఎవలన్న ఏఁవన్న అనుకోనియ్. ఒంట్ల నెత్తురుంది. కష్టం జేసుకుంట. నా పిల్లల జూసుకొని బతుకుత అనుకున్న. ఎనక్కొచ్చి కాళ్లేతులు, మొఖం కడుకున్న. కడుపునిండ నీళ్లు తాగిన. కొంగు తోని మొఖం తుడ్సుకున్న. బలం ఒచ్చినట్లైంది. కట్టెల మోపు ఎగేసుకొని ఒక్కదాన్నే ఎత్తుకున్న. ఇంటిదారి పట్టిన.

*

ఇప్పుడు ఊర్లెకు కరంటొచ్చింది. సిచ్చు ఒత్తితె జాలు మిల్లు ఆనయితుంది. ఇన్నొద్దులు మిల్లు నడు వాల్నంటే ఇంజన్ల డీజిల్ పోసేది. డీజిలింజను ఆన్ గావాల్నంటే యాండిల్ పట్టుకొని తిప్పాలె. ఇంజనా నయేసరికి కడుపుల పేగులు నోట్లకొచ్చేయి. కరంటొచ్చి నంక సుత మిల్లుపట్టెందుకు చాతగాట్లే. కాసేపు నిలబడ్తె కాళ్లు గుంజుతున్నయ్, నడువులు గుంజుతున్నయి. ఇన్నొద్దులోదిగ చాతగాట్లే. ఊరు చిన్నబస్తీ లెక్క అయింది. ఊర్ల ఒక్క మిల్లుకు మూడు మిల్లులయి నయ్. వానల్లేవు. చెరువుల నీళ్లు లేవు. బావులల్ల నీళ్లు ఎండిపోయినయి. ఎరువు లేసేటందుకు పైసల్లేవు. చానామంది భూవులు బీడు పెట్టింద్రు. మిల్లుకి గిరాకి తక్కువైంది.

ఆయనకిప్పుడు ఊర్ల సర్పంచిగిరి లేదు. ఎప్పటి లెక్కనే తింటడు. తిరుగుతడు. పంటడు. దెబ్బలు మట్కు కొడ్తలేడు. సాగిచ్చుకునేటియన్ని సాగిచ్చు కుంటనే వుంటడు. తానం జెయడు. దోతిడువడు. మూడు రోజులు గానియ్ వారం రోజులు గానియ్

నీళ్లు గాసి చెయమంటె చేస్తడు. లేకుంటె లేదు. ఇన్నొద్దులు రోజుకు రెండుసార్లు తానం జేసేటోడు. టినోపాళ్ల ఎయ్యని దోతి తొడగనోడు.

"నన్ను తినవంటలేదు. తాగవంటలేదు. తానం జేపిస్తలే,"దని కన్పించినోనికల్ల చెప్పుకుంట తిరుగు తుండు. కొందరి కాన్నయితే ఏడుస్తుండంట. దెబ్బలకు బదులు యిట్ల పచారం చేస్తుండు.

మొగోడు ఏడ్చేసరికి సూసేటోల్లకు ఎట్లుంటది. అళ్లొచ్చి "ఏంది తాయమ్మ ఈశ్వరయ్య అట్లయిండు. ఊర్ల పెద్దమనిషిగున్నోడు పిచ్చోని తీర్గ అయ్యిండు. జర అరుసుకొమ్మ,"ని నాకు జెప్పేటోళ్లేగని, ఆనికి ఒక్కరు చెప్పరు. ఆయన పని ఆయన చేసుకోవటానికి బరువా? నేనేవన్న వుత్తగుంటున్ననా?

పంది తిన్నట్టు తింటడు. ఒంటిసోయి లేదాని ఈ మద్దెన బాగా కోపమొస్తుంది - ఒంట్ల బలం వుడిగి పోయేవోఁ. అయినా ఎన్నేండ్లని యిట్ల జేయ. విస్వాసంగ వున్న కుక్కన్న ఎన్నడన్న కోపమొచ్చి కరుస్తది. నేనంత కన్న అద్వాన్నవైతిని. ఒంట్ల చీవుఁనెత్తురు లేకుండ పోయిందా ఏంది? ముసల్దాన్నయినా ఇదే బత్కాయె. బెదుర్తా వుంటె బెదిరిచ్చుకుంటరు.

ఈని సంగతి చూద్దామని ఎనిమిది దినాలు తానానికి నీళ్లుపెట్టలే. ఆడట్లనే తానం జేయలే. మూడు దోతులిడిసిండు. నాల్గోది ఒంటిమీద నల్లగ మసిగుడ్డ లెక్కైంది. దోతుతుక్కోడు, తానం జేయడు.

పదిగంటలకు అన్నం యాల్లకు పీటేస్తే ఒచ్చి కూసుండు. అన్నం పెట్టిన తింటుండు. నా కడుపు మండుతుంది.

"ఎన్నిరోజులని అట్లుంటవ్, తానం జేయక. మందిల నన్నెందుకిట్ల బదునామ్ జేస్తవ్? ఎన్నాండనిట్ల జేస్తవ్?"

"నువ్వు తానానికి నీళ్లు బెట్టినవా?" తిను కుంటనే.

"నేను బెట్టాల్నా? కడుపుకు తింటవుగని ఒళ్లు సోయిలేదా?"

"దోతుల్లేవు."

ఆని మాటలు జూడు ఎట్లుంటయ్.

"దోతుల్లేకుంటె ఉతుక్కోవాలె. ఎన్నాండ్లరుడవో నీకు. ఎన్నేండ్లని నాతోటి జేయించుకుంటవ్? పొద్దు దాంక ఏం జేస్తున్నవ్? పైస పని చెయ్యవైతివి. ఎంతకని చెయ్య ఒక్కదాన్ని. ఏడికని వుర్క. దున్నపోతు లెక్క తింటవ్ గని దోతులుతుక్కోను చేతగాదా?"

అన్నం తినేటోడు లేసి నిలబడి, "సువ్వర్‌ముండ ఊకుంటా వుంటె నెత్తికెక్కుతున్నవ్. దున్నపోతు లెక్క కనిపిస్తున్నానే నీకు లంజదానా?"

"గుద్దమూతి నడిచిందిగని పౌరుషం పోలేదింక."

ఎంగిలి చేయితోని మీదికురికొచ్చిండు.

"ఏంది అట్లురుకొస్తున్నవ్. కొడ్తవా? కొట్టు."

పండ్లు పటపట కొరుక్కుంట చేయి గడుక్కొని బయటపడ్డడు. ఇంకేడికి ఆళ్ల అక్కోలింటికే. మా ఆడి బిడ్డోళ్లు కూడా వూరికొచ్చి మూడు, నాలుగేండ్లు అయి తుంది. మా యింటికి కొంచెం దూరంల్నే ఆల్లిల్లుంది. మా ఆడిబిడ్డోళ్లు ఈడికొచ్చిన కాన్నుంచి ఆళ్లు గూడ సతాయిస్తా వున్నరు. ఊ అంటె ఆ అంటె ఆళ్ల అక్కో లింటికి ఉరుకుతడు.

*

ఈశ్వరయ్య అక్కోల్లింటికి పోగానే అల్లుడు ఎదురుంగ కనపడ్డడు. చెప్పులిడుసుకుంట,

"ఎప్పుడొచ్చినవ్ ఎంకటేశం. బాగున్నవా?"

"బాగానే ఉన్న. మీరు బాగుండ్రా," అని మంచం మీద సోటు సూపిస్తె కూసుంట, "ఆ... ఆ... బాగానే వున్న. ఒక్కనివే ఒచ్చినట్టుంది. లచ్చివిని తీస్కరాలేదా?"

"అయ్యకు బాగోలేదంటె చూసి పోదామని వచ్చిన. పిల్లలకు బడి వుంది. అందుకని తీస్కరాలేదు"

"చిన్నోన్నన్న తీస్కరాకపోయినావా?"

"ఆడు గూడ బడికి పోతుండు,"

"అన్నం తిన్నావురా?" అక్క.

"ఆ... తిన్న. ఏం తినుడో. తిన్న తిండి ఒంటికి బట్టనిస్తుందా ఆ బద్మాష్‌ది."

"ఏఁవైందిరా? మల్లేమన్న అన్నదా?" అక్క.

"నేను దున్నపోతు లెక్క తింటున్ననంట. దానికి బాగా కొవ్వుపట్టి కండ్లు కనిపిస్తలేవక్క,"

తాయమ్మ మీద తాయమ్మ మొగనికంటె ఎక్కువ అధికారం వుంది వీళ్లకు, బిడ్డను జేసుకొని. తమ్మున్ని అంటె ఆళ్లనన్నంత బాధ అయ్యి, కొడుకుతో-

"యిన్నావురా ఎంకటేశ. మీ అత్తనోటికి ఎంత లావు మాటొస్తె అంతలావు మాటంటుంది మాఁవని. మన యిండ్లల్ల మొగన్ని ఎవరన్న ఇట్లన్నరా?"

"నీ పెండ్లాన్ని జర చేతుల్లో బెట్టుకోరా..." హెచ్చరిస్తూ ఆడబిడ్డ మొగుడు.

"చేతులుండక ఏడికిబోద్ది," ఎంకటేశం.

తండ్రి ముందల బిడ్డ గురించి అట్ల చెప్తున్నా ఆ తండ్రికి చీమకుట్టినట్టైనా లేదు. ఇక్కడ తండ్రి బిడ్డల

సంబంధం ఎక్కడుంది. ఆడదాన్ని చేతుల బెట్టుకునే సంబంధాలే.

"ఆ తల్లి కడుపున పుట్టిందే. బుద్ధిలేడికి బోవ్. ఓ కంట కనిపెట్టు," ఆడబిడ్డ.

వరుస కోడలి మీదకి మల్లుతుందని సంభాషణ మారుస్తూ ఆడబిడ్డ మొగుడు,

"మీ అత్త యవ్వారం ముదుర్తుంది. చిన్న చిన్న మాటలు పొయ్యి పెద్ద మాటల కాడికొచ్చింది," అని,

"మీ మాఁవ జూడు ఎట్లుండు- సూస్తనే దయ్యం బట్టేట్టు. ఎన్ని దినాలయిందో తానం జేపించక."

చిన్నపిల్లగాడు తానం ఒగరు జేపించాలి.

"అవును మాఁవ తానం జెయకపోతే దోతు లన్నిడువకపోతివి," అల్లుడు.

"అది నా దోతులుతుకుతున్నాదయ్యా... దానికి నా వాసనే పొర్తలేదు."

"చూడంగ చూడంగ వ్యవహారం ముదురుతున్న ట్టుంది," అల్లుడు.

వెంటనే, "నేను ఇందాకన్నుంచి మొత్తుకుంటు న్నదే గదరా," ఆడబిడ్డ మొగుడు.

ఆ ముచ్చట యీ ముచ్చట మాట్లాడేసరికి పొద్దు గూకింది. గౌండ్లావె ఆటికెల కల్లు తీసుకొని వచ్చింది.

"అర్రల పీట లేస్తావ్," ఆడిబిడ్డ మొగుడు భార్యతో.

మూడు పీటలేస్తె ఒచ్చి కూసున్నారు. ఆడిబిడ్డ మొగుడు కల్లొంపుతున్నడు. కల్లు తాగుకుంట,

"పొద్దుటిది కంచంల పెట్కరా," భార్యతో.

"నాకు గుద్దమూతి నడిచిందంట. ఆ లంజెదం టుంది. ఆ యింట్ల వుండలేకపోతున్న బావా," తాగు కుంట.

"బాగా పొగరెక్కినట్టుంది. ఎట్ల నెగుల్తున్నవ్ మాఁవా," తున్క నోట్లేసుకుంట అల్లుడు.

"ఏం నెగులుడు ఎంకటేశం. దాని కండ్లకు అర్చెయ్యి మందం కొవ్వు పట్టింది."

"అట్ల పడుకుంట ఎందుకుంటవ్ ఈశ్వరయ్య. నువ్వు ఊఁ అను ఇంకో పిల్లనుజేస్తం. అప్పుడు కరుగుద్ది దాని కొవ్వంత," ఆడిబిడ్డ మొగుడు.

"దానికి నేనున్నా లేకున్నా ఒకటే.... బావ. అది యిట్లినదు. ఇన్నేండ్ల సంది సూస్తనే వున్న గద. మిల్లు జూసుకొనే దానికంత కొవ్వు."

"నిజవే, ఏం జూసుకుని దీనికింత ధైర్నం అను కొనేటోన్ని. బానే కనిపెట్టినవ్ ఈశ్వరయ్య," ఆడిబిడ్డ మొగుడు.

"మరి మిల్లమ్మక పోయినవ్ మాఁవ," అల్లుడు.

"ఎన్నిసార్ల అమ్మేదావన్నా పడనిచ్చినాదయ ఆ లబ్డిముండ."

"మరి మిల్లమ్మే ఏర్పాటు చేయమంటా," ఆడిబిడ్డ మొగుడు.

"అది మాట్లాడేటందుకే ఈడికొచ్చినా. టయాన్కి ఎంకటేశం గూడ ఒచ్చిండు."

"ఎవలకమ్మేదాఁవనుకుంటున్నవ్," ఆడిబిడ్డ మొగడు.

"ఎవలకన్న ఒకరికి అమ్మెయాలె. దాని పొగరు దించాలె."

"మీ పక్కింటి సూరి ఓ కన్నేసి వుంచింది గద. దానికే అమ్మితే," ఆడిబిడ్డ మొగడు.

"అదేదో తొందర్గ జెయ్యి బావ. లంజదాన్ని చెప్పు కింద నల్లిని నలిపినట్టు నలపాలె."

"మిల్లమ్మినంత మాత్రాన లొంగస్తదంటవా," అల్లుడు.

"లంజదానికి పనిలేకుండ జేస్తెగని దాని కావురం కరగదు."

"బయటికి పొయ్యి ఏరే పన్జేస్తనంటదేవో ఈశ్వరయ్య," ఆడిబిడ్డ మొగడు.

"దాన్ని మల్ల గడప దాటనిస్తాను," అని,

"ఎప్పుడు పొయ్యి మాట్లాడ్తవ్ బావ."

"రేప్పొద్దుటికి ఈడికే పిలిచ్చి మాట్లాడ్త. అటుకెళ్లి ఒస్తె నీ పెండ్లం సూస్తది," ఆడిబిడ్డ మొగడు.

"ఇంతకి అత్త అమ్మనిస్తుందంటవా మాఁవ?" అల్లుడు.

"నయానో భయానో చెప్పి అమ్మాలి," ఆడిబిడ్డ మొగడు.

"భయాన జెప్తె అది అసలినదు. మొండికేస్తది బావ."

"అయ్యా...! నువ్వైతె ముందు సూరితో మాట్లాడు. తర్వాత ఏంజేయాల్నో ఆలోచిద్దాం," అల్లుడు.

"రేపుంటవ్ గదా ఎంకటేశం."

"రేపుంటగని ఎల్లుండి చీకటితోని లేసి పోదా వఁనుకుంటున్న మాఁవ," అల్లుడు.

"ఇదేదో తేలేదాంక వుండరాదు."

"సెలవుల్లేవు... సరే, సూస్త," అల్లుడు.

"సరే, నేను రేప్పొద్దునొస్త. బావ పొయొస్త."

"అన్నం తిని పోర," ఆడిబిడ్డ.

"ఎందుకులే అక్కా."

"తినకేడికి పోతడు," ఆడిబిడ్డ మొగడు.

*

ఇంటెన్కాల గిన్నెలు తోఁవుతున్న. పక్కింటి సూరి తిడ్తావుంది. ఏందోలే అని పట్టించుకోలే. అది చిన్న పంచాతొస్తె పోనియదు. ఎప్పుడు ఎవల్తోనో ఒగరితోని లొల్లి పెట్టుకుంటది.

"లంజెలు రేయింబగల్లు దడదడ సప్పుడు జేసు కుంట వుంటె పండుకోవాల్నా? ఒద్దా? మిల్లుల అగ్గన్న బుట్టదు."

దీపావళి దగ్గరకొస్తుంది. ఒడ్లు బాగొస్తున్నాయ్. రాత్రి పదయ్యేదాంక మిల్లుకు యిరాఁవం వుంటలే. అది నన్నే తిడ్తుంది. పంచాతి పెద్దగనే అయింది.

మా బావ నన్ను పిలిపిచ్చిండు. నేను పొయేసరికే మా ఆడిబిడ్డ మొగడు, మా బావ, ఈన కూసొని వున్నరు. 'ఈడు ఈడికొచ్చిండేందో? అది ఆడ పంచాతి పెట్టు కుంటె నిమ్మలంగ బయటపడ్డడు. ఒక్క మాటన్న మాట్లాల్లే,' అనుకున్న.

పొయ్యి గోడవార నిలబడ్డ. మా ఏరాలు యింట్ల నుండి బయటికి రాలే. ఎవరు సప్పుడు జేస్తలేరు. నాకేఁవో కోపమొస్తుంది పిలిపిచ్చి సప్పుడు జేస్తలేరని. కొంచెమాగి నేనే, "ఏంది పిలిపిచ్చింఁడ్రు? యింటికి తాళం బెట్టొచ్చిన. మిల్లుకి గిరాకి బోతది."

మా బావ, "ఏంలేదు. మీ పక్కింటి సూరమ్మ ఒచ్చి చెప్పింది. పంచాయితయిందంటగా."

"అవ్ అయింది. అయితేందంట."

"రాత్రయ్యేదాంక నువ్వు మిల్లు పట్టొద్దు. ఆళ్లకు నిద్రుంట లేదంట," బావ.

నా కష్టం నేను జేసుకున్నా కండ్లల్లమంటే. నా బతుకే మిల్లు మీద ఎల్తుండె. గిరాకి వున్నప్పుడే గద నాల్గు పైసలు ఎన్కేసుకునేది. పక్కింటిదాన్ని సాటు బెట్టుకొని ఈళ్ల మన్సులున్నది ఎళ్లగక్కుతుండ్రు.

"జనం ఒస్తుంటె ఎట్లెళ్లగొట్టాలె."

"పొద్దుగూకంగానే తలుపులెయ్యి. ఆల్లేబోతరు," ఆడిబిడ్డ మొగడు.

"యియ్యాళ బోయినోళ్లు రేపొస్తరా?"

"ఒచ్చినోళ్ల మటుకే ఆయె" బావ.

పాలు తీస్కొచ్చిన గొల్ల మల్లమ్మ యినీ యిని "ఏంది పెద్దయ్య అట్ల మాట్లాడ్తవ్. తలుపులేసుకుంటె పెద్దమ్మెట్ల బత్కుతది. పక్కదానికి సర్దిజెప్పుతవా? పెద్దమ్మను తలుపులు మూసుకోఁవంటవా? ఇదేం నాయం."

"నిన్నెవరు పిలిసింఁడ్రె. మాలావు మాట్లాడ్తున్నవ్. పో... పో... పొయ్యి నీ పన్జూసుకో," నా మొగడు.

"తలుపులు మూసుకుంటె తిండికెట్లాల్లాలె. మీ తమ్ముడు వుద్యోగం గిన సంపాయిచ్చిండా?"

"ఏవేవ్.... ఈశ్వరయ్యేఁవన్నడు. ఆయన జోలికి బోతవ్. మేఁఒటి మాట్లాడ్తె నువ్వోటి మాట్లాడ్తవ్," ఆడిబిడ్డ మొగడు.

"లేకుంటె మీరిద్దరు నెలకు శెరింత యిస్తరా?"

"ఏం మాట్లాడ్తున్నవ్. కండ్లు నెత్తిమీది కొచ్చి నయా? చిన్న పెద్ద తెలుస్తలే?" చానా కోపంగ మా బావ.

సలసలా కాగే నూనెల బూరేస్త పొంగినట్టు పొంగుకొచ్చింది నాక్కోపం. కాణిపైస సంపాయించడు. ఇంటికాడ అది పంచాతి బెట్టుకుంటె మాట్లాడడు. ఈడికొచ్చి ఈళ్లకు ఎగేసుకుంట ఈళ్లతోటి తిట్టిపిచ్చు కుంట కూసుండు. నా ఒళ్లు సలసలా కాగే నూనె లెక్క మసుల్తుంది.

"ఏ బాడుకావింటికన్న పెట్టవనొస్తిన్నా.... పొయ్యి మనొస్తిన్నా.... నా కష్టం నేన్జేసుకున్నా సూల్లేక పోతుంఁడ్రు. ఈపాలి నా జోలికి ఏ లంజది ఏ లంజకొడుకొచ్చినా ఎత్తి ఏడుదోసిల్ల మన్ను బోస్త."

"బాడుకావ్లు, లంజకొడుకులంటున్నవ్," అని కొట్టకొట్ట ఒచ్చిండు నా మొగడు. ఆళ్లందరుండేసరికి ధైర్నం ఒచ్చినట్టుంది.

"మీ యింట్లకు బొయ్యి కొట్టుకోరి. మా యింట్లొద్దు. ఈడికి పడ్డ మాటలు చాలు," మా బావ అని లోపలికి బోయిండు. మా ఆడిబిడ్డ మొగడు చెప్పులు తొడుక్కొని ఆయనా బోయిండు. నాకు దుఃఖ మాగుతలే. నోటికి కొంగడ్డం బెట్టుకొని.

నాయినో... నాయినా...

నాకెంత కష్టవొచ్చెనో నాయినో... నాయినా...

నాకు చెప్పుకునే దిక్కే లేదాయెరో నాయినో... నాయినా...

నాకు సావన్న రాదాయెరో నాయినో... నాయినా...

మా ఏరాలు యింట్ల నుంచి బయటకొచ్చి, "మా యింట్ల సోకంబెడ్తవేంది. ఎవర్జావాలని."

కండ్లు తుడ్సుకొని యింటికి పోయిన. దుఃఖ మాగుతలే . మల్లేడ్చిన.

ఈ గోలకు పక్కింటి గౌండ్లోల్ల పార్వతమ్మొచ్చి,

"ఏంది బిడ్డ అట్లేడుస్తున్నవ్? కడుపుల పేగులు దేవినట్టు."

కండ్లు దుడుసుకొని జరిగిన సంగతి చెప్పిన.

"నీ కష్టం నువ్వు జేస్క బత్కుతున్నవ్. ఆళ్లనంగనే బంజేస్తవా? ధైర్నం జెడకు బిడ్డ. ఊకో... ఊకో..." అని కొంగుతోటి కండ్లు తుడిసి కాసేపు కూసొని ఆ ముచ్చటీ ముచ్చట చెప్పిపోయింది.

ఇట్ల రెండు రోజులు గడిసినయి. పదకొండయి నట్టుంది. అన్నం తింటున్న. మా ఆడిబిడ్డొచ్చింది. లేసి కూసొమ్మని పీటేసిన. కూసుంది. అన్నం తిన్నదాంక ఏం మాట్లాల్లే. అన్నం తిని, కంచం కడిగి బోర్లించొచ్చి, బొట్టు పెట్టి కూసున్న.

"చీకటయ్యిందాంక అట్లనే ఒడ్లు పడ్తున్నవంట. చెప్తింటలేవంట. ఇగ సూరమ్మ నిన్ను యింట్ల నుంచి గుంజి కొడ్తదంట," మా ఆడిబిడ్డ.

నాకు కోపమాగలే. "గుంజి కొడ్తన్నదాన్ని, ఇన్న దాన్ని ఇద్దర్ని మలేసి కొడ్త," అని నేనంగనే మా ఆడిబిడ్డ లేసి ఎళ్లిపోయింది.

మా బావ యింటికి పిలిపిచ్చి తిడ్తడు. ఇప్పుడేఁవో ఇంటికొచ్చి బెదిరిస్తున్నరు. ఏంది ఈళ్ల శనోలే నా ఎంట బడ్డరు.

అన్నం తిని అప్పుడే నడుం వాల్చిన. ఈన బల్లె పీట మీద పండుకుండు. ఎంకటేశం వచ్చిండు.

"ఎప్పుడొచ్చినవ్ నాయినా?"

"మొన్ననే ఒచ్చిన," ఎంకటేశం.

"మొన్నొచ్చి యియాల్టిదాంక రాలేదు. నువ్వు ఒచ్చినవని ఎవలన్న జెప్పలే."

"ఆ... పనుండి రాలేదు."

"లచ్చివి గిన బాగుందా? పిల్లలెట్లుంఁడ్రు?"

"అంత బాగనే వున్నరు."

బల్లెపీట మీద పండుకన్నోడు లేసి కూసుండు. "కూసో ఎంకటేశం," అంటె మాఁవ పక్కన కూసుండు. కొంచెంసేపు ఆ మాట ఈ మాట మాట్లాడి, "పక్కింటి సూరి పంచాతి పెట్టుకుందటగా."

"అవు ఎంకటేశం. నెగల్నిస్తలేదు," ఈన.

సూరి పంచాతి పెట్టుకున్నప్పుడు ఒక్క మాట నలే. చిన్నగ జారుకున్నడు. ఆళ్ల అన్న ఇంటికి పిలిపిచ్చి తిట్టిచ్చిండు. ఇప్పుడిట్ల మాట్లాడ్తుండు. చిత్రంగుంది.

"అవును నాయినా."

"దానికి మిల్లు మీద కన్ను పడ్డదేవోఁ అత్త."

"దానికి కన్నుబడ్తె మనవేం జేస్తం నాయినా."

"పోని మిల్లమ్మరాదత్త. ఎన్నేండ్లని కష్టపడ్తవ్."

నా గుండెల రాళ్లుబడ్డయ్. "మిల్లమ్మితె ఎట్లెల్లుత దింట్లకు."

"కష్టపడి యిద్దరు కొడుకులను సదివించినవు. ఆళ్లు పెద్ద ఉద్యోగాలే చేస్తున్నరు గద. నెలకింత పంపి యమను వాళ్లను."

ఎవని కొడుకులు. కొడుకులు పంపిస్తరంట. ఇల్లు బాగు చేస్తెందుకు పైసలడిగినప్పుడు ఆళ్లన్న మాటలు యాదికొచ్చినయ్....

దసరా పండుగకు కొడుకులొచ్చింఁడ్రు. రమ్మని బస్సు కిరాయిలు పంపిస్తె లచ్చివి గూడ ఒచ్చింది. కోడండ్లు ఆళ్ల తల్లిగారింఢ్లల్లకు పొయింఁడ్రు. పండగయి పోయింది. లచ్చివి అత్తగారింటికి పొయింది.

కొడుకులిద్దరు ఒక్కతాన కూసొని మాట్లాడు కుంటుంఁడ్రు. ఇల్లు ముచ్చట అడుగుదావని పొయ్యి "వానొస్తె యింట్ల వుండొస్తలేదురా. మిద్దె కూలి పోయే టట్టుంది. మన్ను బోయించినా కురుస్తనే వుంది. బెంగుళూరుపెంక కప్పిస్తె ఎట్లుంటదిరా?"

"కప్పిస్తె బానె వుంటది," పెద్దోడు.

"ఎవరు గప్పియాలె," చిన్నోడు.

"ఎవరో కప్పిచ్చేదుంటె మీకెందుకు జెప్తరా? మీరే."

"మిల్లుమీద పైసలొస్తలెవ్వా?" పెద్దోడు.

"ఇన్నాటోదిగ వున్నాదిరా. ఊర్ల ఒకటికి మూడు మిల్లులయినయి."

"మా ఇంట్ల చెట్టుగ్గాస్తున్నాయా పైసలు?" చిన్నోడు.

ఎన్నడన్న నోరు తెరిసి ఒక్క పైసడగలే. ఇప్పుడు అడిగేసర్కి నా కొడుకులలకు ఎంత కోపం ఒస్తుంది అనుకొని, "పైసలు చెట్లకు గాసేదుంటె నేనే ఓ చెట్టు బెట్టుకుంట గదరా. మిమ్ముల్నెందుకు అడుగుత."

"మా దగ్గర పైసల్లేవు. మాకే ఆడికాడికి అయి తుంది," చిన్నోడు.

"ఏ నెలది ఆ నెలకే సరిపోతుంది," పెద్దోడు.

"ఇంజనీర్లైతిరి. జీతాలు ఎక్కువే వుంటయంట గద."

నా కొడుకులకు చానా కోపమొచ్చింది లెక్క లడుగుతున్ననని. ఆళ్లు నన్నడిగితే ఏంగాదు.

"మాకు మూట గట్టిచ్చినట్టు మాట్లాడ్తున్నవ్," పెద్దోడు.

''మూట గట్టిచ్చేటందుకు నాకాడేఁవుందిర. రెక్కల కష్టం జేసిన. సదివించిన.''

నా చిన్నకొడుకు కూసున్నోడు దిగ్గున లేసి చెయ్యి సూపించుకుంట, ''ఇగో.... ఇంత పొడుగు, ఇంత పొడుగు, బారెడు చదివించినవ్. నువ్వు చదివించినట్టు లోకంల ఎవరన్న చదివించినారు పిల్లల్ని.''

''మేం చదువుకోకపోతే నువ్వు చదివిద్దువా?'' పెద్దోడు.

ఈ కొడుకులే గదు నా కష్టాలు తీరుస్తరనుకున్న.

''మీతోటి గిట్ల అడిగిచ్చుకొనేటందుకేరా సావ కుంట బతికింది, ఇన్ని కష్టాలు పడ్డది.''

''ఎవరు కష్టపడమన్నరు,'' చిన్నోడు.

''నేను మొండిదాన్నిరా. మీ కొరకు ఎందుకు బత్కుతరా. నాకే పానంమీద తీపి. మీ కొరకు ఎదురు సూడ్డం నాదే తప్పురా. మంచిది కొడుకులారా మంచిది. బాగ బుద్ధి చెప్పిన్రురా...''

''ఏందత్త మాట్లాడవ్,'' అల్లుడు.

''బాగుంది నాయినా, చేతుల పని పోగొట్టుకొని ఆళ్లను బిచ్చవెత్తనా.''

''కొడుకుల కాడ పైసలడుగుడు బిచ్చమెత్తుడైతదా?'' ఈన.

''అయినా వినోద పెండ్లికి చిట్టేస్తున్న. తిండికి ఆళ్లిచ్చినా చిట్టెవరు గడ్తరు.''

''మిల్లమ్మిన పైసలు బ్యాంకులేసి, ఒచ్చిన ఒడ్డీ తోని చిట్టి గట్టు,'' అల్లుడు.

''బ్యాంకు లేసుడెందుకు ఎంకటేశం. నువ్వే తీస్కొని, మందికెంత ఒడ్డీ యిస్తున్నవో మాకంతే యియ్యి,'' ఈన.

''బానే వుంది. మిల్లమ్మినట్టే ఒడ్డీగిడ్డీ మాట్లాడ్తున్నవ్. మిల్లమ్మితే ఎన్ని వేలొస్తయి. ఎంతొడ్డీ ఒస్తది.''

''మోటరు, మిల్లుకు గలిపి పదివేల దాంక వస్తయి,'' ఈన.

''పదివేల మీద ఒచ్చే ఒడ్డీతోని చిట్టికెల్లుతదా?''

''మిల్లు, యిల్లు రెండమ్ముదాం,'' ఇదే సందని అల్లుడు.

నా యింటికి ఎసరు బెట్టేటందుకే ఒచ్చినట్టుంది శనోలె. నా కడుపుల బరాలు పేలినట్టుగైతుంది. ఏవన్న అందునా బిడ్డను జేసుకున్నోడు. నేనేఁవన్నా పొయ్యి దాని మీద పడ్తరు.

''ఉన్న నీడను, చేతుల పనిని పోగొట్టుకున్నోళ్ల నేనాడ జూల్లే నాయినా...''

''సూరి పెద్ద మనుసుల్ల పెట్తదంట,'' ఈన.

''పెట్టుకుంటె పెట్టుకోనియ్. సప్పుడు లేకుంట మిల్లెట్ల నడుస్తదని ఆళ్లనే అడుగుత.''

తెల్లారి అల్లుడు ఒచ్చుకుంటనే, ''మావ సూరి పెద్ద మనుసులల్ల పెట్టింది. అందరు గూసున్నరు. మిమ్ముల్ని పిలుస్తున్నరు''

''అట్లనా. ఇగో ఒస్తున్న,'' అని దండెం మీదున్న కండువ భుజమ్మీద ఏసుకొని, దోతి గోసి చెక్కుకుంట చెప్పులు తొడుక్కుంటుండు.

''నువ్వొక్కనివే పోతున్నవేంది? నేను గూడ ఒస్త.''

''నువ్వేడికి,'' ఈన.

''పెద్దమనుసుల్లకి.''

''సూరికి సిగ్గులేక పెద్దమనుసుల్ల బెట్టింది. నువ్వట్లనే ఒస్తవా?'' ఈన.

''సూరి పంచాతి నీతోటి బెట్టుకుందా, నాతోటి బెట్టుకుందా? పంచాతి ఎట్లొచ్చింది, ఏఁవేఁవన్నది ఎవరు జెప్తరు?''

''వాళ్లేదన్న అడుగితే నేనున్నగద,'' ఈన.

''తొందర్గ రా మావ. అందరు ఎదురు చూస్తున్నరు,'' అల్లుడు.

యిద్దరు గల్సి ఎళ్లిపోయింద్రు.

ఈల్లేదో మోసం జేస్తున్నరు. ఏం మోసఁవో అర్థమయితలే. పెద్దమనుసుల్ల అది అన్ని నా మీదనే చెప్తది. అట్ల గాదు, గిట్ల. అది గిట్లంటే నేను గిట్లన్న. గిదీ ఒరుస అని నేజ్జెప్తగని ఆయన జెప్తడా? ఆయన అయాళ పంచాతి మధ్యన్నే జారుకునే.

''ఓ... తాయమ్మత్త జరొొచ్చి గీ గంపదించమ్మో,'' అని కూతేస్తె అప్పుడు మెల్కువొచ్చింది. టైము మూడో నాలుగో అయితున్నట్టుంది. పొయ్యి గంప దించిన.

''ఏందత్త మున్నాల్గు సార్ల పిలిస్తెగని పల్కుత లెవు,'' ఒడ్లు తెచ్చిన పున్నమ్మ.

''ఊ... ఏంలే పున్నమ్మ. ఏందో ఎన్కటి ముచ్చట యాదికొస్తె ఆలోసించుకుంటున్న.''

ఒడ్ల మిల్లు ఆన్జేసిన. ఒడ్లు పట్టుట్ల పడ్డ. పొద్దు గూకింది. జర చీకటి పడ్డది. కోళ్లను గమ్ముతున్న ఈన, అల్లుడు, ఆడిబిడ్డ మొగడు ముగ్గురు కల్సొచ్చింద్రు. నా మన్సుకేందో కీడన్పించింది ముగ్గురు కల్సొచ్చిన్రు, ఏం జేసుకొచ్చిన్రో అని. ముగ్గురొచ్చి బల్లెపీట మీద కూసుండ్రు. నేను ఆళ్లనే సూసుకుంట నిలబడ్డ ఏం జెప్తరో అని.

''మిల్లు, యిల్లు రొండమ్మేసిన,'' ఈన.

నా కడుపుల అగ్గిగుండాలు పేల్నయి.

“మీ కడుపులు గాలగదరా
మీ నెత్తిన దుమ్ము బోయగదరా
మీ నెత్తిన మన్ను బోయగదరా
మిమ్ములేట్ల బెట్టగదరా
మీకు పెద్దరోగం బుట్ట
నన్నరిగోస పెడ్తుంటిరి గదరా
నా ఎంట యిట్ల బడ్డరేందిరా?
మీకేమన్యాయం జేసిన్రా?
నెత్తిత్తు నేల బడ్డకాంచి
నన్ను కలికలి జేస్తుంటిరి గదరా
మీ కడుపుల్ల పెద్ద పుండు బుట్ట
మీ కడుపుల్ల యింత యిసవున్నాదిరా
పాఁవుకు పడగల్నే యిసముంటది
మీకు నిలువెల్ల యిసవే గదరా
మిమ్ముల కాష్టంల బెట్ట
మంచి మంచోల్లకు సావొస్తది
మీకు సావన్న రాదేందిరా”

కడుపుల మంట సల్లార్తలేదు. గూట్లున్న ఎర్ర మన్ను కసికొద్దిగ ఆళ్లమీద దోసిల్లతోటి గుప్పిన.

“ఏందే లంజె మన్ను గుప్తున్నవ్. నీ పొగరన్నే టందుకేనే గీ పన్జేసింది,” అని నా మొగడు సిగబట్టిండు. బలం కొద్దిగ గజ్జల్లల్ల ఒక్కటి దన్నిన. పొరక దీసుకున్న ఎఁవ జంపుడు జంపిన. ఎన్నాండ్ల బాధ! అల్లుడు, ఆడి బిడ్డ మొగడు యిద్దరు నా మీదికొచ్చింట్రు. బాడుకావ్ లను ఆళ్లను గూడా అందిన కాడికి దంచిన. ఈ సందు జూసుకొని ఈ బాడుకావ్ ఉరికిండు. ఆళ్లిద్దరు ఎటోళ్లు అటురికింట్రు. పొరకాడ పడేసిన. దుఃఖమాగు తలే. కడుపుల పేగులు కల్లంకల్లం అయితున్నయి.

నన్నెందుకు గన్నవే అమ్మో.... అమ్మా...
పుట్టిన్నాడె సంపక పొయినవే అమ్మో.... అమ్మా...
కొడుకులగని ఏం సుఖపడ్డనే అమ్మో.... అమ్మా...
కడుపు నిండ కూడెరగనైతినే అమ్మో.... అమ్మా...
కంటి నిండ నిద్రెర్గ నైతినే అమ్మో.... అమ్మా...
ఒంటి నిండ బట్టెర్గ నైతినే అమ్మో.... అమ్మా...
సీత కష్టాలు పెడ్తుంట్రు గదనే అమ్మో.... అమ్మా...
రెక్కల కష్టంజేసి, పైస కళ్ల జూడనైతినే అమ్మో.... అమ్మా...
నా కష్టవంత రాళ్ల పాలాయెనే అమ్మో.... అమ్మా...
నన్నీ బందెల దొడ్లెకు తోల్తివి అమ్మో.... అమ్మా...
నన్నడివిల బడేస్తివి గదనే అమ్మో.... అమ్మా...
నేనెవరికి జెప్పుకుందునే అమ్మో.... అమ్మా...
నన్ను బత్కనిస్తలేరాయెనే అమ్మో.... అమ్మా...
సచ్చిందాంక నా ఎంటబడ్తున్నరే అమ్మో... అమ్మా...
నేనెట్ల బత్కుదునే అమ్మో.... అమ్మా...
నాదెంత మొండి బత్కాయనే అమ్మో.... అమ్మా...
నాకు సావన్న రాదాయెనే అమ్మో.... అమ్మా...
నా పాణం యిసిగి పోయిందే అమ్మో.... అమ్మా...
నన్ను నీ కాడ్కి దీస్కపోవే అమ్మో.... అమ్మా...
నీ కొంగుల దాసుకోవే అమ్మో.... అమ్మా...
నీ కడుపుల బెట్టుకోవే అమ్మో.... అమ్మా...

*మహిళామార్గం త్రైమాసిక పత్రిక,, జులై-డిసెంబర్, 1996*

